# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - బుధవారం 30 ఏప్రిల్ 2025 | సంపుటి:9 | సంచిక:124 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


## 14 ఏండ్ల క్రికెటర్‌కు 10 లక్షల నజరానా



నగదు బహుమతితో వైభవ్‌ను సన్మానిస్తున్న బీహార్ సీఎం నితీశ్

2

## ఆకాశ రథంలో ఆ రాజదంపతులు



2

### పాక్‌కు అనుకూలంగా మాట్లాడితే
# అక్కడికే వెళ్లిపోండి



**మంగళగిరి:** మత ప్రాతిపదికన 26 మందిని చంపినా పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడటం సరికాదని, అలా మాట్లాడాలనుకుంటే ఆ దేశానికే వెళ్లిపోవాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మత ప్రాతిపదికన చంపడం సరికాదన్నారు. ఇటీవల జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి మంగళగిరి సి.కె.కన్వెన్షన్‌లో హాలులో నివాళుల కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. ఉగ్రవాదం, హింసపై అందరూ ఒకేలా స్పందించాలన్నారు. కశ్మీర్ భారత్‌లో భాగమని, ఇలాంటి విషయాలపై ఓట్లు, సీట్ల కోసం మాట్లాడకూడదని చెప్పారు. ఈ ఘటనలో

...మిగతా 2లో

## తిరుమల శ్రీవారి సేవలో సినీనటి ఆషిక రంగనాథన్



**తిరుమల,ఏప్రిల్ 29, మనం న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సినీనటి ఆషిక రంగనాథన్ కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం ఉదయం స్వామివారి నైవేద్యం విరామ సమయం అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు దర్శనం అనంతరం రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయం వెలుపల పత్రిక ప్రతినిధులతో

...మిగతా 2లో

## అవకాశాలు కల్పిస్తాం..
# అందిపుచ్చుకోండి

### సంస్థలను స్థాపించే స్థాయికి ఎదగాలి



- క్వాంటమ్ వ్యాలీకి చిరునామాగా అమరావతి
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడి
- విట్‌లో నూతన భవనాలకు ప్రారంభోత్సవం

**అమరావతి:** ప్రభుత్వం తరఫున యువతకు అవకాశాలు కల్పిస్తామని, అవసరమైన ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేస్తామని వాటిని అందిపుచ్చుకుని ఎదగాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉద్యోగంతో సంతృప్తి చెందకుండా వినూత్న ఆలోచనలు, నూతన ఆవిష్కరణలతో సంస్థలను స్థాపించాలని దిశానిర్దేశం చేశారు. ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతామని, క్వాంటమ్ వ్యాలీకి అమరావతి చిరునామా కానుందని పేర్కొన్నారు. అమరావతిలోని విట్ వర్సిటీలో వి-లాంచ్‌పాడ్ 2025 స్టార్టప్ ఎక్స్‌పోను సోమవారం చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం కొత్త బ్లాక్‌లను ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విట్ వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ విశ్వనాథన్ విట్ ఏర్పాటుకు 200 ఎకరాలు కోరితే 100 ఎకరాలు ఇచ్చానని,

...మిగతా 2లో

## కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ వరకు ఉదయ్ ప్రయాణం స్ఫూర్తిదాయకం

### సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



**అమరావతి:** ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్‌కష్ణారెడ్డి కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ వరకు చేసిన ప్రయాణం అభినందనీయమని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ధైర్యం, అవిశ్రాంత కషి ఉంటే ఏ కల కూడా పెద్దది కాదని ఉదయ్ రుజువు చేశారని సీఎం పేర్కొన్నారు. కష్టపడేవారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారిగా ఉదయ్ ఎదిగారని లోకేశ్ కొనియాడారు. ఆయన ప్రయాణంలో ధైర్యసాహసాలు, త్యాగం, అవిశ్రాంత సంకల్పం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఉల్లపాలేనికి చెందిన ఉదయ్‌కష్ణారెడ్డి.. ఇటీవల వెల్లడైన సివిల్స్ ఫలితాల్లో 350వ ర్యాంక్ సాధించారు.

## సైన్యమే వారి సంగతి చూసుకుంటది

- ఉగ్రవాదాన్ని అణచివేయడంలో రక్షణ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నం
- టెర్రరిజం అంతం జాతీయ సంకల్పం
- రక్షణ మంత్రి, రక్షణ దళాధిపతుల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ



**ఢిల్లీ, ఏప్రిల్ 29:** ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో భారత సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. పహల్గాం దాడి అనంతరం సరిహద్దులో

...మిగతా 2లో

## పాక్ సార్వభౌమత్వ రక్షణ చర్యలకు మద్దతిస్తం

### చైనా విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి



**బీజింగ్, ఏప్రిల్ 29:** తన సార్వభౌమత్వాన్ని, భద్రతను కాపాడుకునేందుకు పాకిస్థాన్ తీసుకునే అన్ని చర్యలకు తాము మద్దతిస్తామని చైనా సోమవారం స్పష్టం చేసింది. భారత్-పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతలను చల్లార్చడానికి అవసరమైన అన్ని చర్యలను తాము స్వాగతిస్తామని చైనా పేర్కొంది. అలాగే జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై సత్వర, నిష్పాక్షిక దర్యాప్తును కోరుకుంటున్నామంది. ఈ మేరకు చైనా విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ మీడియాతో మాట్లాడారు. దర్యాప్తులో చైనా భాగస్వామి అవుతుందా? అన్న ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానం ఇవ్వలేదు.

## పహల్గాంపై పార్లమెంటు సమావేశాలు పెట్టండి

- ఉభయ సభలూ చర్చించాలి.. ఐక్యత చాటాలి
- ప్రధాని నరేంద్ర మోడీకి రాహుల్ గాంధీ లేఖ



**ఢిల్లీ, ఏప్రిల్ 29:** పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో పార్లమెంటులో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కోరుతూ ప్రధాని మోడీకి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. పర్యాటకులపై

...మిగతా 2లో

## రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

**గుత్తి:** అనంతపురం జిల్లా గుత్తి వద్ద నిజామాబాద్-తిరుపతి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ లో చోరీ జరిగింది. ఆగి ఉన్న రైలులోకి ఐదుగురు దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రయాణికులకు చెందిన బంగారం, నగదుతో పాటు విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు లైన్‌క్లియర్ చేసేందుకు గుత్తి శివారులో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను నిలిపారు. ఈ సమయంలోనే దుండగులు ఆ రైలులోకి 10 బోగీల్లో దోపిడీకి పాల్పడ్డారు.

## అమరావతిలో ప్రధాని పర్యటనకు 90 శాతం ఏర్పాట్లు పూర్తి



**అమరావతి:** ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. మిగిలిన పనులను రేపటికి పూర్తిచేస్తామని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ''రూ.43 వేల కోట్ల పనులను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుంది. రాజధాని కోసం కేవలం 50 రోజుల్లో ఒక్క సమస్య కూడా లేకుండా రైతులు భూములు ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో రాజధాని కట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సింగపూర్ సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందించాం. 365 కి.మీ ట్రంక్ రోడ్లు, 1500 కి.మీ లే ఔట్ రోడ్లు నిర్మించేలా ప్లాన్ ఉంది. గతంలోనే రూ.41 వేలకోట్లకు పనులు ప్రారంభమయ్యాయి.

...మిగతా 2లో

# రూల్స్ మారినయ్?

### రేపట్నుంచి రైల్వేలో కొత్త నిబంధనలు
### వెయిటింగ్ లిస్ట్ టికెట్‌తో స్లీపర్, ఏసీ బోగీల్లో ప్రయాణం నిషిద్ధం



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తరచూ రైలు ప్రయాణాలు చేసేవారికి భారతీయ రైల్వే ఒక ముఖ్యమైన అప్‌డేట్‌ను ప్రకటించింది. మే 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధనల ప్రకారం, వెయిటింగ్ లిస్ట్ టికెట్లతో స్లీపర్ లేదా ఏసీ కోచ్లలో ప్రయాణించడంపై ఆంక్షలు విధించనున్నారు. ఇది కన్‌ఫర్మ్ టికెట్లు ఉన్న ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయంగా రైల్వే శాఖ స్పష్టం చేసింది. తాజా నిబంధనల ప్రకారం, వెయిటింగ్ టికెట్ కలిగిన ప్రయాణికులు కేవలం జనరల్ బోగీల్లో మాత్రమే ప్రయాణించాల్సి ఉంటుంది. మే 1 నుంచి

...మిగతా 2లో

## ఐరన్ స్క్రాప్‌తో ప్రధాని మోదీ, ఎన్టీఆర్ ప్రతిమలు.. తెనాలి శిల్పుల నైపుణ్యం




**అమరావతి:** ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా తెనాలి కళాకారులు ప్రత్యేక విగ్రహాలను రూపొందించారు. ఐరన్ స్క్రాప్‌తో ప్రధాని మోదీ, మేకిన్ ఇండియా లోగో, ఎన్టీఆర్ ప్రతిమ, తెదేపా సైకిల్ గుర్తును తయారు చేసి ప్రదర్శించారు. ఈ విగ్రహాలను మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి సందర్శించారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రలను ఈ సందర్భంగా అభినందించారు.

## భవనం పైనుంచి పడి ముగ్గురు కార్మికుల మతి

**తిరుపతి (మంగళం):** తిరుపతి నగర సమీపంలోని మంగళం పరిధిలో విషాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనం పైనుంచి ప్రమాదవశాత్తు పడి ముగ్గురు

...మిగతా 2లో

# శ్రీతేజ్ డిశ్చార్జ్

## కుదురుకోని సంధ్య థియేటర్ తొక్కిసలాట బాధిత బాలుడి ఆరోగ్యం

### మమ్మల్ని గుర్తు పట్టడం లేదు : బాలుడి తండ్రి భాస్కర్
### సీఎం రేవంత్ రెడ్డి నుంచి మాకు మంచి మద్దతు లభించింది



**హైదరాబాద్, ఏప్రిల్ 29:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. డిసెంబర్ 4న పుష్ప ప్రీమియర్ షో సందర్భంగా చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ గాయాలపాలై సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి కాస్త నిలకడగా ఉండటంతో వైద్యులు ఆస్పత్రి నుంచి

...మిగతా 2లో

# అంతా గప్‌చుపాక్

**ఢిల్లీ, ఏప్రిల్ 29:** పహల్గాం ఉగ్రదాడితో భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. అలాగే తమపై భారత్ వైమానిక దాడులు చేయొచ్చని భయపడుతోన్న పాకిస్థాన్ ఆ దిశగా చర్యలు చేపడుతోంది. దాంతో నియంత్రణ రేఖ వెంబడి పాక్ బలగాలు అప్రమత్తమవుతున్నాయి. భారత వైమానిక దాడులను పసిగట్టడానికి సియాల్ కోట్ ప్రాంతానికి పాకిస్థాన్ సైన్యం తన రాడార్ వ్యవస్థలను తరలిస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ సరిహద్దుకు 58 కి.మీ. దూరంలో ఉన్న ఛోర్ కంటోన్మెంట్ వద్ద టీపీఎస్-77 రాడార్ సైట్ ను ఏర్పాటు చేసింది. గతవారం భారత్ రఫేల్ సహా ఫ్రంట్ లైన్ ఫైటర్ జెట్లు పెద్దఎత్తున సైనిక విన్యాసంలో పాల్గొన్నాయి. దీనితో పాక్ ఈ చర్యలకు దిగినట్టు సమాచారం.

పహల్గాం ఘటన నేపథ్యంలో భారత్ ప్రతీకార దాడి చేపడుతుందని, త్వరలోనే ఇది జరిగే అవకాశం ఉందని పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి ఖవాజా మహమ్మద్ ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ''ఇప్పుడు అది (ప్రతీకార దాడి) జరగనున్న విషయం కాబట్టి.. మా బలగాలను అప్రమత్తం చేశాం.

# విమానాలు, నౌకలు బంద్

### పాక్ విమానాలకు మన గగన తలం మూసివేత?

- భారతీయ పోర్టుల్లోకి ఆ దేశ నౌకలకు నిషేధం
- దాయాది దేశానికి ఇది మరో మరణ శాసనం



**ఢిల్లీ, ఏప్రిల్ 29:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిసాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పాకిస్తాన్ గగనతలంపై మన దేశ విమానాల రాకపోకలపై నిషేధం విధించింది.భారత్ కూడా దీనిపై ప్రతీకారంగా పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇక, పాకిస్థానీ నౌకలు కూడా భారత పోర్టుల్లోకి రాకుండా నిషేధం విధించనున్నట్లు తెలుస్తోంది.

ఈ ప్రతిపాదన పరిశీలన దశలో ఉంది. తుది నిర్ణయం తీసుకోలేదు.. అయితే, ఒకవేళ దీనిపై నిర్ణయం తీసుకుంటే మాత్రం సింధు నదీ జలాల నిలిపివేత వలే ఇది కూడా పాక్‌కు మరో మరణ శాసనమవుతుంది. విమానాల రాకపోకలపై నిషేధం విధిస్తే పాక్ విమానాలు కౌలాలంపూర్ సహా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్లాండ్ వంటి దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లాలంటే చైనా లేదా శ్రీలంక మీదుగా

...మిగతా 2లో

### ఉగ్రవాదాన్ని పోషిస్తున్నామని
# పాక్ మంత్రే చెప్పారు

- ఐరాసలో ప్రపంచ దేశాల ముందు పాకిస్తాన్ ను ఎండగట్టిన భారత్
- ఆ దేశాన్ని ప్రపంచం అంగీకరించదన్న యోజనాపటేల్

**న్యూయార్క్, ఏప్రిల్ 29:** సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత్ లో హింసకు పాల్పడుతున్న పాకిస్తాన్ ను భారత్ అంతర్జాతీయ వేదికపై ఎండగట్టింది. ఐక్యరాజ్యసమితిలో పహల్గాం ఉగ్రదాడిని లేవనెత్తిన భారత్ ఆ దేశంపై విరుచుకుపడింది. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నామని స్వయంగా పాక్ మంత్రే బయటపెట్టిన విషయాన్ని ప్రపంచం ముందు ప్రస్తావించింది. ఇకపై ప్రపంచం కళ్లు మూసుకుని ఉండిపోదని హెచ్చరించింది. న్యూయార్కులో 'ఉగ్రవాద అనుబంధ నెట్వర్క్ బాధితుల' కార్యక్రమంలో ఐరాసలో భారత డిప్యూటీ శాశ్వత ప్రతినిధిగా ఉన్న యోజన పటేల్ మాట్లాడుతూ ''సీమాంతర ఉగ్రవాదానికి కొన్ని దశాబ్దాలుగా మేం బాధితులం. ఉగ్ర చర్యల వల్ల బాధితులు, వారి కుటుంబాలతో పాటు

...మిగతా 2లో

# పాక్‌కు అనుకూలంగా మాట్లాడితే అక్కడికే వెళ్లిపోండి: పవన్‌కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోయిన శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా కావలికి చెందిన మధుసూదన్‌రావు కుటుంబానికి పార్టీ తరఫున రూ.50లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఉగ్రఘటనలో జనసేన ఓ కార్యకర్తను కోల్పోయిందని అన్నారు. ''సత్యం మాట్లాడాలంటే చాలా ధైర్యం కావాలి. చనిపోయిన మధుసూదన్‌రావు ఎవరికి హాని చేశారు?. కుటుంబాన్ని తీసుకొని కశ్మీర్‌కు వెళ్తే చంపేశారు. కశ్మీర్ మనది కాబట్టే అక్కడికి వెళ్లామని మధు భార్య చెప్పారు. హిందువులకు ఉన్న దేశం ఇదొక్కటే. ఇక్కడ కూడా ఉండొద్దంటే ఎక్కడికి పోవాలి?. యుద్ధ పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలి. మత కలహాలు సృష్టించే వారిపై అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలి'' అని పవన్ కల్యాణ్ అన్నారు.

# తిరుమల శ్రీవారి సేవలో సినీనటి ఆషిక రంగనాథన్

(మొదటి పేజీ తరువాయి)

సినీనటి ఆషిక రంగనాథన్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.తెలుగులో చిరంజీవి గారితో కలిసి విశ్వంభర చిత్రంలో నటిస్తున్నానని అలాగే తమిళంలో కార్తీక్ గారితో సర్దార్ 2 చిత్రంలో నటిస్తున్నానని తెలిపారు. విశ్వంభర చిత్రంలో చిరంజీవి గారితో నటించడం చాలా సంతోషంగా ఉందని అంత పెద్ద నటుడితో నటించడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని ఈ చిత్రం విడుదల కోసం నేను కూడా ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నానని తెలిపారు.

# భవనం పైనుంచి పడి ముగ్గురు కార్మికుల మతి



(మొదటి పేజీ తరువాయి)

మేస్త్రీలు దుర్మరణం పాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. తుడా క్వార్టర్స్‌లోని హెచ్‌ఐజీ విభాగంలో ప్లాట్ నంబర్ 63లో శ్రీకాళహస్తికి చెందిన ఆండాలయ్య ఐదంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన పనులను పెళ్లకూరు మండలం అక్కగారిపేటకు చెందిన బొటోతొట్టి శ్రీనివాసులు (40), ఒంగోలుకు చెందిన వసంత్, కె.శ్రీనివాసులు, కావలికి చెందిన మాధవ చేస్తున్నారు. ఐదో అంతస్తులో పని జరుగుతున్న సమయంలో మేరవ కర్రలు ఊడిపోయాయి. ఈ క్రమంలో మాధవ తప్పించుకోగా.. మిగిలిన ముగ్గురూ పైనుంచి కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనాస్థలానికి పోలీసు, రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులు చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాలను రుయాకు తరలించారు.

# ఆకాశ రథంలో ఆ రాజదంపతులు



**ఢిల్లీ, ఏప్రిల్ 29:** ఆ రాజదంపతులు విమానం నడిపి వార్తల్లోకెక్కారు. ఇటీవల భూటాన్ పర్యటనకు వెళ్లిన థాయ్ లాండ్ రాజు, రాణి స్వయంగా విమానాన్ని నడపడమే ఒక విశేషమైతే.. ప్రపంచంలో అత్యంత సవాళ్లతో కూడిన విమానాశ్రయాల్లో ఒకటిగా పేరు పొందిన పారో ఎయిర్‌పోర్టులో సేఫ్ ల్యాండింగ్ చేయడం మరో విశేషంగా చెప్పుకోవచ్చు. భూటాన్ రాజు ఆహ్వానం మేరకు థాయ్ లాండ్ రాజు మహా వజ్రలాంగ్ కోర్న్.. రాణి సుతీదాలు ఇటీవల భూటాన్ పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా రాజకుటుంబానికి చెందిన బోయింగ్ 737-800 విమానాన్ని నడుపుకుంటూ భూటాన్‌కు వెళ్లారు. నాలుగురోజులు అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొన్న థాయ్లాండ్ రాజదంపతులు తిరుగు ప్రయాణంలోనూ స్వయంగా విమానం నడుపుతూ వెళ్లారు. రాయల్ థాయ్ ఆర్మీలో రాజు మహా వజ్రలాంగ్ కోర్న్ గతంలో కెరీర్ ఆఫీసర్ గా సేవలందించారు. ఎఫ్-5, ఎఫ్-16తోపాటు బోయింగ్ 737-400ను నడిపే అర్హత సాధించారు. 2019నుంచి ఆయన రాజుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# 14 ఏండ్ల క్రికెటర్‌కు 10 లక్షల నజరానా

**పాట్నా, ఏప్రిల్ 29:** వేగవంతమైన సెంచరీ చేసిన యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీపై బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రశంసించారు. రాజస్థాన్ రాయల్స్ జట్టులో ఆడుగున్న 14 ఏండ్ల క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో 35 బంతుల్లోనే శతక పరుగులు చేసి.. ఐపీఎల్లో వేగవంతమైన సెంచరీ చేసిన క్రికెటర్‌గా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీపై ప్రశంసలు కురిపించిన బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ వైభవ్ కు రూ.10 లక్షల నగదు బహుమతిని అందజేసి సత్కరించారు.

# సైన్యమే వారి సంగతి చూసుకుంటది

(మొదటి పేజీ తరువాయి)

ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఢిల్లీలోనూ ఒకదాని వెంట ఒకటిగా కీలక పరిణామాలు జరుగుతున్నాయి. ప్రధాని మోడీ నివాసంలో మంగళవారం కీలక సమావేశం నిర్వహించారు. దాదాపు గంటన్నరపాటు సాగిన ఈ భేటీలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, సీడీఎస్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, త్రివిధ దళాల అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేశంలో అంతర్గత భద్రతతోపాటు సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. ఉగ్రవాదాన్ని అణచివేయడం జాతీయ సంకల్పమని ఈ సందర్భంగా ప్రధాని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో దృఢనిశ్చయంతో ఉన్నామన్నారు. పహల్గాం దాడికి దీటైన బదులిస్తామని తెలిపారు. కార్యాచరణ రూపొందించుకోవడంలో భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిస్తున్నామని, ఎప్పుడు, ఎలా స్పందించాలో సైన్యమే నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

# అవకాశాలు కల్పిస్తాం.. అందిపుచ్చుకోండి

(మొదటి పేజీ తరువాయి)

మరో 100 ఎకరాలు ఇస్తామని, రాబోయే ఏడేళ్లలో 50,000 మంది విద్యార్థులు విట్‌లో చదివేలా అభివద్ధి చేయాలని కోరారు. అమరావతిలో ఏర్పాటు చేసే విద్యా సంస్థలు ఇతర రాష్ట్రాలు, దేశాల విద్యార్థులు కూడా చదువుకునేలా ఉండాలని ఆకాంక్షించారు. అమరావతిలో 5 లక్షల మంది విద్యార్థులు చదవాలన్నారు. 'సిలికాన్ వ్యాలీ నుంచి స్పేస్ ఎక్స్, గూగుల్ నుంచి మైక్రోసాఫ్ట్, నాసా నుంచి వాల్‌స్ట్రీట్ వరకు ఎన్నోచోట్ల తెలుగువారు సత్తా చాటుతున్నారు. నాలెడ్జ్ ఎకానమీని మరోస్థాయికి తీసుకెళ్లడానికి యువత వినూత్న ఆలోచనలు చేయాలి' అని చంద్రబాబు సూచించారు.

**అన్ని ప్రాంతాల అభివద్ధి**

'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివద్ధి చేస్తున్నాం. విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దుతాం. కొత్త ఎయిర్‌పోర్టు, మెట్రోతోపాటు త్వరలో గూగుల్ రాబోతోంది. ఆర్సెల్లార్ మిత్తల్ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెడుతోంది. రాయలసీమలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం. అనంతపురంలో లేపాక్షి మొదలు ఓర్వకల్లు వరకు నాలెడ్జ్ హబ్‌గా తయారు చేస్తున్నాం. రాయలసీమను రక్షణ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంచింగ్ స్టేషన్, గ్రీన్‌ఎనర్జీ రంగాల్లో అభివద్ధి చేస్తాం. భవిష్యత్తు డ్రోన్లదే. ఓర్వకల్లులో డ్రోన్‌సిటీ తొలిసారిగా మనమే ఏర్పాటు చేస్తాం' అని సీఎం చెప్పారు.

**కష్టపడితేనే విజయం**

విద్యార్థులు ముఖ్యమంత్రి చంద్రబాబును వివిధ అంశాలపై ప్రశ్నలు అడగ్గా వాటికి సమాధానం చెప్పారు. ఎంతో దూరం నడిచి వెళ్లి చదువుకున్నానని చెబుతూ తన కుటుంబం ఎదిగిన తీరును వివరించారు. చిన్నతనంలో రోజూ జీవితంలో కష్టపడినవారికి తిరుగుండదని ఉద్బోధించారు. రాజకీయాలను సేవా మార్గంలోనే చూశానని తెలిపారు.

**విద్యార్థులకు అభినందనలు**

అంకుర యూనిట్లు ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ విద్యార్థులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉత్సాహపరిచారు. 'వి-లాంచ్ స్టార్టప్ ఎక్స్‌పో' పేరుతో విద్యార్థులు తమ ఆవిష్కరణలు, ఆలోచనలను ప్రదర్శించారు. రోబో టెక్నాలజీ, డ్రోన్ సాంకేతికత, విద్యుత్తు తయారీ, నిర్మాణ రంగ ఉపకరణాలు, ప్రజలకు నిజ జీవితంలో ఉపయోగపడే వస్తువులు తయారు చేసిన వారిని సీఎం అభినందించారు. మరింత కొత్తగా ఆలోచించాలని, మెరుగ్గా తయారు చేయాలని సూచించారు. నైపుణ్య గణనపై ఓ విద్యార్థి ఇచ్చిన ప్రజంటేషన్ సీఎంను ఆకట్టుకుంది. వెంటనే ఆ బందంతో మాట్లాడాలని సీఎంవో అధికారులకు సూచించారు. విద్యార్థులతో ఫొటోలు దిగారు. విట్ వ్యవస్థాపకుడు డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ రాష్ట్రాభివద్ధి కోసం ప్రభుత్వానికి అన్నివిధాలా సహకారం అందించటానికి తాము సిద్ధంగా ఉంటామని తెలిపారు.

# అమరావతిలో ప్రధాని పర్యటనకు 90 శాతం ఏర్పాట్లు పూర్తి: మంత్రి నారాయణ

(మొదటి పేజీ తరువాయి)

2019కు ముందు రూ.5 వేల కోట్ల బిల్లులు కూడా చెల్లించాం. గత ప్రభుత్వం రాజధానిపై మూడు ముక్కలాట ఆడింది. న్యాయపరమైన సమస్యలు లేకుండా ముందుకెళ్లేందుకు ఇంత సమయం పట్టింది. మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి చేస్తాం. సోమవారం అమరావతి ప్రాంత రైతులతో సీఎం రెండుగంటలపాటు మాట్లాడారు. 29 గ్రామాల రైతులను ప్రధాని సభకు రావాలని సీఎం స్వయంగా ఆహ్వానించారు. అమరావతిపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని రైతులు కోరారు. ఈ అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు'' అని నారాయణ తెలిపారు.

# ఉగ్రవాదాన్ని పోషిస్తున్నామని పాక్ మంత్రే చెప్పారు

(మొదటి పేజీ తరువాయి)

సమాజంపై ఎలాంటి దీర్ఘకాల ప్రభావం ఉంటుందో మాకు తెలుసు. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నామని, ఉగ్ర సంస్థలకు నిధులు సమీకరిస్తున్నామని ఇటీవల పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ చెప్పిన మాటలను యావత్ ప్రపంచం విన్నది.
ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నామని వారు బహిరంగంగా అంగీకరించినా.. ఎవరూ ఆశ్చర్యపోలేదు. పాక్ ఎలాంటి మోసపూరిత దేశమో దీన్ని బట్టి మరోసారి స్పష్టమైంది. ఆ దేశం అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది.
ప్రపంచం ఇకపై కళ్లు మూసుకుని కూర్చోదు'' అని ఆమె హెచ్చరించారు. భారత్ పై నిరాధార ఆరోపణలు చేయడానికి ఈ అంతర్జాతీయ వేదికను పాక్ దుర్వినియోగం చేస్తోందని పటేల్ మండిపడ్డారు. ఇక, పహల్గాంలో ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాయని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రపంచ దేశాధినేతలు భారత్ కు మద్దతు పలికాయని, ఉగ్రవాదాన్ని అంతర్జాతీయ సమాజం ఎన్నటికీ అంగీకరించబోదని అన్నారు.

# పహల్గాంపై పార్లమెంటు సమావేశాలు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన పాశవిక దాడి నేపథ్యంలో పార్లమెంటులో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని విపక్ష ఎంపీల నుంచి డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ప్రధాని మోడీకి లేఖ రాశారు.

రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ఈవిషయాన్ని వెల్లడించారు. 'పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ప్రతి భారతీయుడిని ఆగ్రహానికి గురిచేసింది. ఈ క్లిష్ట సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మనం కలిసి ఉంటామని అందరికీ తెలియజేయాలి. పార్లమెంటు ఉభయ సభల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేయాలని ప్రతిపక్షాలు విశ్వసిస్తున్నాయి' అని రాహుల్ పేర్కొన్నారు. కాగా.. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోడీకి లేఖ రాశారు. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఈ విషయాన్ని ఎక్స్ ద్వారా వెల్లడించారు.

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని విపక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించిన సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా మద్దతుగా నిలుస్తామని స్పష్టం చేశాయి. ఈ క్రమంలోనే పార్లమెంటులో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని విపక్షాల నుంచి డిమాండ్ చేస్తున్నాయి. ఈవిషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలంటూ స్వతంత్ర ఎంపీ కపిల్ సిబల్ ఇప్పటికే రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. పహల్గాం దాడిని ఖండిస్తూ తీర్మానం చేయడం ద్వారా దేశం మొత్తం ఐక్యంగా ఉందనే సందేశాన్ని ప్రపంచానికి ఇవ్వాలని ఆయన సూచించారు.



# రూల్స్ మారినయ్ ?

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిబంధనను పక్కాగా అమలు చేయనున్నారు. ఒకవేళ ఎవరైనా వెయిటింగ్ టికెట్తో స్లీపర్ లేదా ఏసీ కోచ్లలో ప్రయాణిస్తున్నట్లు టికెట్ తనిఖీ సిబ్బంది (టీటీఈ) గుర్తిస్తే, వారిపై చర్యలు తీసుకుంటారు. ఈ మార్పునకు గల కారణాన్ని వాయువ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కెప్టెన్ శశికిరణ్ వివరిస్తూ, 'కన్‌ఫర్మ్ టికెట్లు ఉన్న ప్రయాణికుల సౌకర్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని తెలిపారు. చాలా సందర్భాల్లో వెయిటింగ్ టికెట్లు ఉన్నవారు స్లీపర్, ఏసీ కోచ్లలోకి ప్రవేశించి, కన్‌ఫర్మ్ టికెట్లు ఉన్నవారి సీట్లలో కూర్చోవడం లేదా బోగీలో ఇరుకుగా మార్గాలను ఆక్రమించడం వంటివి చేస్తున్నారని, దీనివల్ల కన్‌ఫర్మ్ టికెట్లు ఉన్న ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల కదలికలకు కూడా అంతరాయం ఏర్పడుతోందని రైల్వే శాఖ గుర్తించింది. ఇకపై నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు తప్పవు. వెయిటింగ్ టికెట్‌తో స్లీపర్ కోచ్‌లో ప్రయాణిస్తూ పట్టుబడితే, ప్రయాణికుడికి రూ. 250 జరిమానాతో పాటు, ప్రయాణానికి పూర్తి ఛార్జీని వసూలు చేసే అవకాశం ఉంది. ప్రయాణించే దూరాన్ని బట్టి అదనపు ఛార్జీలు కూడా విధించవచ్చు. అదేవిధంగా, థర్డ్ ఏసీ లేదా సెకండ్ ఏసీ కోచ్లలో వెయిటింగ్ టికెట్తో ప్రయాణిస్తే జరిమానా మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రయాణ ఛార్జీకి అదనంగా సుమారు రూ. 440 వరకు జరిమానా చెల్లించాల్సి రావచ్చు.

అంతేకాకుండా, నిబంధనలు ఉల్లంఘించిన ప్రయాణికుడిని జనరల్ కోచ్‌లోకి పంపించే అధికారం లేదా తదుపరి స్టేషన్‌లో రైలు నుంచి దించివేసే అధికారం టీటీఈకి ఉంటుంది. ఫస్ట్ క్లాస్‌లో ఇలా ప్రయాణిస్తే జరిమానా మరింత భారీగా ఉంటుందని తెలుస్తోంది.

# విమానాలు, నౌకలు బంద్

(మొదటి పేజీ తరువాయి)

చుట్టూరా తిరిగి పోవాల్సి ఉంటుంది. అప్పుడు ప్రయాణసమయం పెరగడంతో పాటు నిర్వహణ పైనా అదనపు భారం పడుతుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన పాక్ ఎయిర్ లైనర్లకు ఇది మరింత శరాఘాతంగా మారనుంది. ఇప్పటివరకు భారత్ నుంచి పాక్ గగనతలం మీదుగా వారానికి 800లకు పైగా అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించేవి. ఇందుకోసం ఫీజు కింద పాక్ రోజుకు 1,20,000 డాలర్లు వసూలుచేసింది. ఇప్పుడు ఆ మొత్తాన్ని దాయాది నష్టపోవాల్సిందే. 2019లో పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో దాదాపు 5 నెలల పాటు పాక్ తమ గగనతలంలో భారత విమానాలపై ఆంక్షలు విధించింది. దీంతో అప్పట్లో ఆ దేశం 100 మిలియన్ డాలర్ల పైగా నష్టపోయినట్లు సమాచారం.

# శ్రీతేజ్ డిశ్చార్జ్

(మొదటి పేజీ తరువాయి)

డిశ్చార్జి చేశారు. ఇక్కడి నుంచి రిహాబిలిటేషన్ కేంద్రానికి తరలించాలని వైద్యులు సూచించారు. అక్కడ 15 రోజుల పాటు ఉంచి ఫిజియోథెరఫీ వంటివి నిర్వహించాక ఇంటికి తీసుకెళ్లొచ్చని సూచించినట్లు సమాచారం. శ్రీతేజ్ కు మొత్తంగా 4 నెలల 25 రోజుల పాటు ఆస్పత్రిలో వైద్యం కొనసాగింది.

**మమ్మల్ని గుర్తు పట్టడంలేదు..**

''శ్రీతేజ్ ఐదు నెలలుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గత 15 రోజుల నుంచి ఐసీయూ నుంచి రూమ్ కు షిఫ్ట్ చేశారు. బాబు ఆరోగ్య పరిస్థితి కొంచెం ఇన్ఫెక్షన్లు లేకుండా నిలకడగా ఉంది. వైద్యులు హాబిలిటేషన్ సెంటర్కు తరలించాలని సూచించారు. ఆ తర్వాత ఇంటికి తీసుకెళ్లొచ్చని తెలిపారు. ఇప్పుడు కళ్లు తెరిచి చూస్తున్నాడు. ద్రవరూపంలో ఉన్న ఆహారం మాత్రమే పంపిస్తున్నాం. బ్రెయిన్ అయితే ఇంకా రికవరీ కాలేదు. మమ్మల్ని గుర్తు పట్టడంలేదు. ఆస్పత్రిలో ఎన్ని రోజులు ఉన్నా ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుందని.. రిహాబిలిటేషన్ కు తీసుకెళ్తే కొంత మెరుగుపడొచ్చని వైద్యులు సూచించారు. ఎప్పటికీ జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. పుష్ప- 2 చిత్రం యాజమాన్యం, సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం నుంచి మాకు బాగా మద్దతు లభించింది. బాబు ఆస్పత్రిలో చేరిన రెండో రోజు నుంచే మాకు సపోర్టు అందింది. ఇప్పటికీ మమ్మల్ని వైద్యులు, కిమ్స్ యాజమాన్యం డబ్బులు అడగలేదు. డిశ్చార్జి సమయంలో ఏమీ బలవంతం చేయలేదు. శ్రీతేజ్ చెల్లెలు అమ్మ ఏది? అని అడుగుతోంది. ఊరెళ్లిందని చెబుతున్నాం. బాబుని చూసేందుకు పాపను ఆస్పత్రికి తీసుకెళ్లినప్పుడు.. తను మాట్లాడుతున్నా శ్రీతేజ్ స్పందించడం లేదు. మాకు సపోర్టు చేసిన అందరికీ కృతజ్ఞతలు'' అన్నారు.



**హెల్త్ బులిటెన్ విడుదల**

మరోవైపు, శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిపై కిమ్స్ వైద్యులు హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. ఇవాళ శ్రీతేజ్ ను డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. ''బాలుడిని న్యూరో రిహాబిలిటేషన్ సెంటర్ కు తరలించాం. శ్రీతేజ్ కు ఆక్సిజన్, వెంటిలేటర్ సహాయం అవసరంలేదు. నోటి ద్వారా ఆహారం తీసుకొంటున్నాడు' అని తెలిపారు.

# అందాల పోటీలకు అన్నీ సమకూర్చాలె

**మిస్ వరల్డ్ పోటీల నిర్వహణలో లోపాలు తలెత్తకూడదు**

- నగర సుందరీకరణ పనులు వెంటనే పూర్తి చేయాలె
- కట్టుదిట్టమైన భద్రతను కల్పించాలె
- విభాగాలవారీగా ప్రత్యేకాధికారులతో పర్యవేక్షణ
- ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, మనం బ్యూరో:** మిస్ వరల్డ్-2025 పోటీలు ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ పోటీల నిర్వహణకు వేదికైన హైదరాబాద్ నగరంలో బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. మిస్ వరల్డ్-2025 ఏర్పాట్లపై మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవెంట్‌కు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనేందుకు వచ్చే పార్టిసిపెంట్లతో పాటు వారితో పాటు వస్తున్న వారికి కూడా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. ఎయిర్‌పోర్టు, అతిథులు బస చేసే హోటళ్లు, కార్యక్రమాలు జరిగే చోట కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. తెలంగాణలో చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్న సీఎం రేవంత్ విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. కాగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వేదికగా మే 10 నుంచి మిస్ వరల్డ్ 2025 పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది.

# జిల్లాలో జాతీయ రహదారుల భూసేకరణ, రైల్వే నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి : జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్



**తిరుపతి, ఏప్రిల్ 29 మనం న్యూస్ :** జిల్లాలో జాతీయ రహదారులకు మరియు రైల్వే లైన్ కు సంబంధించిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జాతీయ రహదారి భూసేకరణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి వర్చువల్ విధానంలో నేషనల్ హైవే పిడి లు, సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓ లు రామ్మోహన్, కిరణ్మయి, భాను ప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారులు నిర్మాణాలకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందని అన్నారు. జిల్లాలో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టులు, జాతీయ రహదారుల సేకరణకు సంబంధించి పనులను ప్రాధాన్యత తీసుకొని వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. దీనికి సంబంధించి రెవెన్యూ డివిజన్ అధికారులు, తాసిల్దారులు, జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. జాతీయ రహదారి భూసేకరణ పనులు త్వరిత గతిన పూర్తికావడానికి ప్రణాళికను రూపొందించుకొని పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణ పనులు పురోగతి ఉన్న రహదారి విస్తరణ పనులు కూడా వేగంగా చర్యలు తీసుకోవాలని భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ పనులలో సంబంధిత ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే గ్రామాలదగ్గర వచ్చే సర్వీస్ రోడ్డు లకు సూచిక బోర్డులను గ్రామ ప్రజలకు తెలిసేలా ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు భూసేకరణ పెండింగ్ అవార్డు సంబంధించిన పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పీలేరు -కాలూరు, రేణిగుంట - నాయుడుపేట జాతీయ రహదారి పనులు ఎటువంటి అలసత్వం లేకుండా వెంటనే పనులు పూర్తయ్యేలా రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్ హెచ్ అధికారులు సమన్వయంతో నిర్దేశించుకున్న గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైల్వే ప్రాజెక్టులు నడికుడి శ్రీకాళహస్తి, గూడూరు రేణిగుంట, తిరుపతి పాకాల ప్రాజెక్ట్ కు సంబంధించిన భూ సేకరణ పనులు పూర్తయ్యేలా ఆర్డీఓ లు, తహసిల్దార్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు .తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పి డీలు తిరుపతి వెంకటేష్, ఎం కె చౌదరి, టెక్నికల్ మేనేజర్ జయలక్ష్మి,, రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీరింగ్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మే 11 నుండి రిషికేష్ శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు



**తిరుపతి, ఏప్రిల్ 29 మనం న్యూస్ :** ఉత్తరాఖండ్ రాష్ట్రం, డెహ్రాడూన్ జిల్లా, రిషికేష్ ఆంధ్ర ఆశ్రమంలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మే 11 నుండి 19వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా మే 6వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. మే 10వ తేదీ సాయంత్రం అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి.
రోజు ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి. వాహనసేవల వివరాలు ఇలా ఉన్నాయి.

**11-05-2025**
ఉదయం - ధ్వజారోహణం
(ఉదయం 10.50 నుండి 11.15 గంటల వరకు)
సాయంత్రం - పెద్దశేషవాహనం

**12-05-2025**
ఉదయం - చిన్నశేషవాహనం
సాయంత్రం - హంసవాహనం

**13-05-2025**
ఉదయం - సింహవాహనం
సాయంత్రం - ముత్యపుపందిరి వాహనం

**14-05-2025**
ఉదయం - కల్పవృక్షవాహనం
సాయంత్రం - సర్వభూపాలవాహనం

**15-05-2025**
ఉదయం- పల్లకీ ఉత్సవం
సాయంత్రం - గరుడవాహనం

16-05-2025
ఉదయం - హనుమంత వాహనం
సాయంత్రం - గజవాహనం

**17-05-2025**
ఉదయం - సూర్యప్రభ వాహనం
సాయంత్రం - చంద్రప్రభ వాహనం

**18-05-2025**
ఉదయం - రథోత్సవం
సాయంత్రం - శ్రీవారి కల్యాణోత్సవం, అశ్వవాహనం

**19-05-2025**
ఉదయం - చక్రస్నానం
(ఉదయం 9 నుండి 9.45 గంటల వరకు)
సాయంత్రం - ధ్వజావరోహణం

ఉత్సవాల్లో భాగంగా మే 18వ తేదీ స్వామివారి కల్యాణోత్సవం జరుగనుంది. రూ .501/- చెల్లించి ఇద్దరు కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

## భవన నిర్మాణ కార్మికులు ముగ్గురు కిందపడి దుర్మరణం



- స్పందించి చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్

**తిరుపతి, ఏప్రిల్29 మనం న్యూస్ :** తుడా లేఅవుట్ నందు నిర్మాణంలో ఉన్న భవనం పైనుండి ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు కిందపడి నేటి మంగళవారం దుర్మరణం పాలైన ఘటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ సత్వరమే స్పందించి చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో తుడా అప్రూవల్ మూడు అంతస్తుల వరకే ఉండగా ఐదంతస్తుల వరకు భవనం నిర్మిస్తున్న భవన యజమాని పై కేసు నమోదుకు చర్యలకు ఆదేశించామని తెలిపారు. విధులు పట్ల అలసత్వం వహించిన సంబంధిత పంచాయతీ కార్యదర్శి పి. స్వాతిశ్రీ నిసస్పెండ్ చేస్తున్నట్లు, అలాగే సంబంధిత ఈవోపీఆర్డి ఆర్. మాధురి కి షోకాజ్ నోటీసు జారీకి ఆదేశించామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అలాగే కార్మిక శాఖ అధికారులు సంబంధిత భవన యజమానికి కార్మిక నష్ట పరిహార చట్టం కింద నోటీసు అందచేయడం జరిగింది.

## తిరుమల శ్రీవారి సేవలో మాజీ టీం ఇండియా క్రికెటర్ శ్రీశాంత్

- క్రికెటర్ శ్రీశాంత్ తో సెల్ఫీలు తీసుకోవడం కోసం పోటీ పడిన భక్తులు



**తిరుమల,ఏప్రిల్ 29,మనం న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మాజీ టీం ఇండియా క్రికెటర్ శ్రీశాంత్ కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం ఉదయం స్వామివారి నైవేద్యం విరామ సమయం అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు దర్శనం అనంతరం రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయం వెలుపల పత్రిక ప్రతినిధులతో మాజీ టీం ఇండియా క్రికెటర్ శ్రీశాంత్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 14 సంవత్సరముల వయస్సు గల వైభవ్ సూర్య వంశీ ఐపీఎల్ 2025 లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్నాడని ఐపీఎల్ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించడమే కాకుండా అద్భుతమైన రీతిలో పరుగులు సాధిస్తూ రెండవ అత్యధిక స్కోరు సాధించి ఐపీఎల్ లో చరిత్ర సృష్టించారని తెలిపారు కామెంట్రీ బాక్స్ నుంచి ఆ మ్యాచ్ చూస్తూ ఉండడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని తెలియజేశారు సౌత్ ఇండియా నుంచి ఇంకా చాలామంది క్రికెటర్లు రావాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలియజేశారు. మాజీ టీం ఇండియా క్రికెటర్ శ్రీశాంత్ తో సెల్ఫీలు తీసుకోవడం కోసం భక్తులు, క్రికెట్ అభిమానులు, స్థానికులు భారీగా రావడంతో శ్రీశాంత్ వారితో చాల ఓపికగా సెల్ఫీలు తీసుకున్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం అవసరమైన నైపుణ్యాల పెంపునకు కృషి :జిల్లా కలెక్టర్




**చిత్తూరు,ఏప్రిల్29 మనం న్యూస్ :** జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్నీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధి అవకాశాల పెంపులో భాగంగా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పరిశ్రమల శాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం వారికి అవసరమైన నైపుణ్యాల పెంపునకు చర్యలు చేపట్టడంలో భాగంగా జిల్లాలో గల పరిశ్రమలకు అవసరమైన శిక్షణ కలిగిన సిబ్బంది నిమిత్తం సంబందిత పరిశ్రమలతో సమన్వయం చేసుకుని శిక్షణ ఇప్పించడంతో పాటు సర్టిఫికెట్ అందజేయడం సంబందిత అంశాలను జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జిల్లా పరిశ్రమ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని తద్వారా ఉపాధి అవకాశాల పెంపుతో పాటు పరిశ్రమలకు అవసరమైన సిబ్బందికి కొరత ఉండదని ఈ దిశగా పనిచేయాలన్నారు. పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ప్రోత్సాహకాలు పొందిన పరిశ్రమల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఏం ఎస్ ఏం ఈ పార్కుల ఏర్పాటుకు కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలో ఏ పి ఐ ఐ సి ద్వారా ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన ల్యాండ్ ను గుర్తించడం జరిగిందని తెలిపారు. ఇది వరకే పరిశ్రమల స్థాపనకు కొరకు భూమి కేటాయింపులు చేసుకున్నవారు పరిశ్రమలను స్థాపించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రూ. 557 కోట్లతో 61,619 మందికి ఉపాది కల్పించేలా 15,371 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉదయం పోర్టల్ దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. సింగల్ డెస్క్ పోర్టల్ కింద 05 మార్చి 2025 నుండి 26 ఏప్రిల్ 2025 వరకు 234 దరఖాస్తులు స్వీకరించగా 222 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయడమైనదని తెలిపారు. పి ఎం విశ్వకర్మ యోజన కింద శిక్షణ పొందిన వారి నుండి అందిన అప్లికేషన్ లలో 385 మందికి ఋణాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎం ఎస్ ఎం ఈ ల ఏర్పాటుకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిఎం ఇండస్ట్రీస్ వెంకట్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్డీఎం హరీష్, డిపిఓ సుధాకర్ రావు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మురళి కృష్ణ, మధుసూదన్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ ఈ ఇస్మాయిల్, జిల్లా పండ్ల సమాఖ్య సభ్యులు బాబీ, ఎస్ ఎస్ సి సి ఐ ఛైర్మన్ డేవిడ్ బ్రెయినార్డ్ మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్లిష్ట పరిస్థితుల్లో దేశ ఐటీ రంగం

- ప్రశ్నార్థకంగా మారిన టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో కంపెనీల మనుగడ
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



**చిత్తూరు, ఏప్రిల్ 29 మనం న్యూస్ :** భారత ఆర్థిక వ్యవస్థకు ఊతనిచ్చిన ఐటీ రంగం ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నార్థకంగా మారిన ఐటీ రంగం స్థితిగతుల పై చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ మంగళవారం ఢిల్లీ నుంచి స్పందించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం అధిరోహణ ఇంజిన్ ఐటీ రంగమన్నారు. ప్రస్తుతం దేశ ఐటి పరిశ్రమ ఇప్పుడు అపూర్వమైన అంతరాయాన్ని ఎదుర్కొంటున్న క్లిష్టమైన దేశమన్నారు. కుంచించుకుపోతున్న క్లయింట్ బడ్జెట్లను ఎదుర్కోంటుందని చెప్పారు. ఆటోమేషన్ వేగవంతం కావడం, భౌగోళిక రాజకీయ హెడ్విండ్లను తీవ్రతరం చేయడం, ఈ రంగం జెయింట్స్ -ఇన్ఫోసిస్, టిసి, విప్రో - జాగ్రత్త సంకేతాలను జారీ చేయడం వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. వృద్ధికి పర్యాయపదంగా ఒకసారి, పరిశ్రమ సున్నా వృద్ధి అంచనాలు, స్టాక్ ధరలను తగ్గించడం , విస్తృత నియామకాలను నియంత్రించడం వంటి అంశాలు తిరోగమనాన్ని చూస్తున్నాయని పేర్కొన్నారు. ఒకప్పుడు అభివృద్ధి చెందుతున్న ఈ రంగం ఆశయాల ద్వారా రూపొందించబడిన బెంగళూరు స్కైలైన్, అనిశ్చిత భవిష్యత్తును ప్రతిబింబిస్తుందని, ఈ పరిశ్రమను ఆయన ఓ ఉదాహరణగా తెలియజేశారు. ఇండియా ఐటి సూచిక ఈ సంవత్సరం దాదాపు 20% తగ్గిందని చెప్పిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు,.., సాపేక్షంగా స్థిరమైన నిఫ్టీ 100 కి పూర్తి విరుద్ధంగా, ఈ రంగం స్థితిస్థాపకత పై విశ్వాసాన్ని తగ్గిస్తుందన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఆధ్వర్యంలో సుంకాల లక్ష్యంతో సహా రక్షణాత్మక విధానాల పునరుత్థానం ద్వైపాక్షిక వ్యాపార సంబంధాలను మరింత దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు.తయారీ , రిటైల్ వంటి పరిశ్రమలు బడ్జెట్ కోతలు, ప్రాజెక్ట్ రద్దులతో స్పందించాయనీ.., అయితే ఇది ఒకప్పుడు అనుభవించిన భారతీయ ఐటి సంస్థలు. ఈ షిఫ్టులు అనాలోచిత వాతావరణాన్ని ప్రవేశపెట్టాయన్నారు. ఏదేమైనా, స్థితిస్థాపకత పాకెట్స్ మిగిలి ఉన్నాయనీ..,. బ్యాంకింగ్ , ఫైనాన్షియల్ సర్వీసెస్ డొమైన్ సాపేక్ష స్థిరత్వాన్ని ప్రదర్శిస్తూనే ఉందన్నారు. ఇది కొనసాగించే సన్నని థ్రెడ్ను అందిస్తుందని ఎంపీ చెప్పారు. ప్రపంచ డిమాండ్ ప్రకృతి దృశ్యం వేగంగా అభివృద్ధి చెందుతోందనీ.., ఐతే ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ టెక్నాలజీస్, సైబర్ సెక్యూరిటీలో నైపుణ్యాన్ని కోరుకుంటారన్నారు. కోడింగ్ కోసం బల్క్ మానవశక్తి అవసరం లేదని..,అందువల్ల ఇది వాల్యూమ్-ఆధారిత డెలివరీ మోడల్ నుండి అధిక-విలువ ఆవిష్కరణలో పాతుకుపోయిన వాటి వరకు అభివృద్ధి చెందాలన్నారు. భారతీయుడు ఈ డొమైన్ లేదా రిస్క్ వాడుకలో ఉన్న బలమైన దావాను అమలు చేయాలని సూచించారు. అప్పుడే భారత దేశ ఐటీ రంగం ప్రపంచ నాయకుడిగా తన స్థానాన్ని తిరిగి పొందుతుందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ అభిప్రాయ పడ్డారు.

## అప్కాస్ను నిర్వీర్యం చేసేందుకు కూటమి సర్కార్ కుట్ర



- అనుకూల ఏజెన్సీలకు మేలు చేసేందుకు సన్నాహాలు
- వైయస్సార్సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్రెడ్డి ఆగ్రహం

**తిరుపతి, ఏప్రిల్ 29 మనం న్యూస్ :** దళారీ వ్యవస్థ లేకుండా అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు మేలు చేసేందుకు ఆనాడు వైయస్ఆర్సీపీ ప్రభుత్వం ప్రారంభించిన ఆప్కాస్ను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైయస్సార్సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు నలమారు చంద్రశేఖరరెడ్డి ఆగ్రహం చేశారు. తిరుపతిలోని వైయస్ఆర్సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తనకు అనుకూలమైన ఏజెన్సీలకు దోచిపెట్టేందుకే కూటమి ప్రభుత్వం ఆప్కాస్ను రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. చిరుద్యోగుల పొట్టకొట్టేందుకు జరుగుతున్న ఈ ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. ఇంకా ఆయనేమన్నారంటే... 2019లో వైయస్సార్సీపీ ప్రభుత్వం ఏర్పాటు కాకముందు ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగం పొందాలంటే లంచాలివ్వాల్సి వచ్చేది. రెగ్యులర్ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలిస్తున్నా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం ఐదారు నెలలకోసారి జీతాలిచ్చేవారు. ప్రతినెలా వచ్చే జీతంలోనూ కమీషన్లు ఇవ్వాల్సి వచ్చేది. కష్టపడి పనిచేస్తున్నా జీతభత్యాల విషయంలో నానా అవస్థలు పడాల్సి వచ్చేది. ఇలాంటి సమస్యల నుంచి వారిని బయటపడేసేలా నాటి సీఎం వైయస్ జగన్ 2019 డిసెంబర్ 19న ఔట్సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు (ఆప్కాస్) చేసి జూలై 3, 2020న ప్రారంభించారు. అదేరోజున 47 వేల మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు నియామక పత్రాలు జారీ చేసిన ఘనత వైయస్ జగన్కే దక్కుతుంది. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాల్లో ఎలాంటి కోతల్లేకుండా ప్రతినెలా ఒకటో తేదీనే చెల్లింపులు జరిగేవి. ఈఎస్ ఐ, ఈపీఎఫ్ జమ చేయడం జరిగేది. వైయస్సార్సీపీ ప్రభుత్వం దిగిపోయేనాటికి దాదాపు లక్ష మంది ఉద్యోగులు ఔట్సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా వేతనాలు పొందేవారు. ఈ ఉద్యోగుల్లో 50 శాతం మంది మహిళలతోపాటు ఎస్సీఎస్టీ బీసీ ఉద్యోగుల నియామకం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకిచ్చిన హామీలను పూర్తిగా గాలికొదిలేశారు.

### ఉద్యోగుల పొట్టకొట్టే దిశగా నిర్ణయాలు

ఉద్యోగులు ఊహించని విధంగా నిన్న ప్రభుత్వం జీవో 802 ను విడుదల చేయడం జరిగింది. ఎన్నికల్లో హామీలు నెరవేర్చకపోగా ఉద్యోగుల పొట్టకొట్టే విధంగా ఆప్కాస్ను రద్దు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అందులో భాగంగా ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామక వ్యవస్థను సమీక్షించడానికి మంత్రులు నారాయణ, లోకేష్, పయ్యావుల కేశవ్ తో కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఐదేళ్లుగా ఉద్యోగులకు పారదర్శకంగా ఒకటో తేదీన ఎలాంటి కటింగ్ లు లేకుండా జీతాలిచ్చిన వ్యవస్థను రద్దు చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎందుకొచ్చింది? ఉద్యోగులకు మంచి చేస్తున్న వ్యవస్థను రద్దు చేసి దళారీల రూపంలో ఉన్న తెలుగుదేశం నాయకుల జేబులు నింపడానికే ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టుగా ఉంది. దాదాపు 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించకుండా పక్కనపెట్టేసింది. గత వైయస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు 10,177 మందిని గుర్తించి అందులో 3 వేల మందికిపైగా అపాయింట్మెంట్ ఆర్డర్ కూడా ఇవ్వడం జరిగింది. ఎన్నికల కోడ్ కారణంగా పెండింగ్లో ఉండిపోయిన మిగిలిన వారికి కూటమి ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోవడం లేదు. ప్రభుత్వం తక్షణం జీవో నెంబర్ 802ని రద్దు చేయాలి. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన ఆప్కాస్ ను కొనసాగించాలి. దళారీ వ్యవస్థను తీసుకొచ్చి ఉద్యోగుల పొట్ట కొట్టొద్దని వైయస్సార్సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

## ఉగ్రదాడిపై వాకర్స్ వార్...!

- డిస్ట్రిక్ట్ 302 క్యాబినెట్ మీట్ లో మతోన్మాదం పై నిరసన
- అశ్రు నివాళి అర్పించిన వాకర్స్
- అసోసియేషన్ల బలోపేతానికి కృషి




**తిరుపతి,ఏప్రిల్ 29 మనం న్యూస్ :** మానవత్వం లేని పాక్ మతోన్మాద ఉగ్రవాదం పై డిస్ట్రిక్ట్ 302 వాకర్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్ మీట్ లో వాకర్స్ సభ్యులు వార్ ప్రకటించారు. మంగళవారం తిరుపతి జిల్లా పుత్తూరు లోని వాకర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వాకర్స్ గవర్నర్ ఆర్ మాధవ నాయుడు, ఎలెక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి రాజు ఆధ్వర్యంలో క్యాబినెట్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా కాశ్మీర్ ఘటనకు అశ్రు నివాళి అర్పించి, పాక్ ఉగ్రవాద మతోన్మాదం పై నిరసన వ్యక్తం చేశారు. కాశ్మీర్ ప్రహల్గాంలో పర్యాటకులను పాక్ ఉగ్రవాదులు కాల్చి చంపడం హేయమైన చర్యగా అభివర్ణించారు. డిస్టిక్ 302 ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని అన్ని వాకర్స్ అసోసియేషన్ లో సకాలంలో ఎన్నికలు నిర్వహించి, ఇంటర్నేషనల్ వాకర్స్ నియమ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. సకాలంలో సభ్యత్వాలు పూర్తిచేసి, వాకర్స్ క్లబ్ బైలాస్ ప్రకారం ప్రతి సభ్యుడు వ్యవహరించాలన్నారు. నూతన కార్యవర్గం ఏర్పడిన తర్వాత వాకర్స్ గవర్నర్ డిస్ట్రిక్ట్ అధ్యక్షులు తదితర ముఖ్య నాయకుల సమక్షంలో బాధ్యతలు తీసుకోవాలన్నారు. జూన్ నెల 29న జరగనున్న వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశాన్ని దిగ్విజయం చేయడానికి చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. తిరుపతిలో జరగనున్న వాకర్స్ మీట్లో అన్ని వాకర్స్ అసోసియేషన్లు, క్లబ్బులు భాగస్వామ్యమై ఐకమత్యంతో విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో గవర్నర్ రావెళ్ల మాధవ నాయుడు, ఎలెక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి రాజు, వాకర్స్ క్లబ్ నేతలు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, చల్లా ముని కృష్ణయ్య, కృష్ణంరాజు, కేఎల్ మూర్తి,రామచంద్ర రాజు, వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, సుకుమార్ రాజు, సభ్యులు చంద్రమోహన్, నిరంజన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య భారతావని దిశగా అలుపెరుగని యాత్ర



ఆరోగ్యమే మహా భాగ్యం అంటారు. కానీ దేశంలో కోట్లాది మందికి ఆ భాగ్యం అందని ద్రాక్షగానే మిగిలింది. స్వాతంత్ర్య ఫలాలు అందినా, వైద్యం చేయించుకోవాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిన దయనీయ స్థితిని ఎందరో అనుభవిస్తున్నారు. ఈ దుస్థితికి తెరదాలుస్తూ, పేదరికం వైద్యానికి అడ్డుకాకూడదనే దృఢ సంకల్పంతో భారత ప్రభుత్వం ప్రారంభించిన అభినందనీయమైన పథకం ఆయుష్మాన్ భారత్ యోజన. ఇది కేవలం ఒక ఆరోగ్య బీమా పథకం కాదు. ప్రతి పౌరుడి ఆరోగ్య భద్రతకు భరోసా ఇస్తూ నవ భారత్ నిర్మాణంలో వేసిన ఒక విప్లవాత్మక అడుగు. ఏప్రిల్ 30న జరుపుకునే ఆయుష్మాన్ భారత్ దివాస్ ఈ మహత్తర లక్ష్యాన్ని గుర్తుచేస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి ఒక సువర్ణావకాశం.

**ఆవశ్యకత:**

ఆర్థిక భారం లేని ఆరోగ్య భద్రత ఆర్థిక అసమానతలు ఆరోగ్య సంరక్షణ లభ్యతపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. నాణ్యమైన వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిన నేపథ్యంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్యం ఒక శాపంగా పరిణమిస్తోంది. ఈ సవాలును అధిగమించి జాతీయ ఆరోగ్య విధానం 2017 సిఫార్సుల మేరకు యూనివర్సల్ హెల్త్ కవరేజ్ సాధించాలనే దార్శనికతతో ఆయుష్మాన్ భారత్ రూపుదిద్దుకుంది. 'ఎవరినీ వదిలిపెట్టకూడదు' అనే స్థిరమైన అభివృద్ధి లక్ష్యానికి అనుగుణంగా ఈ పథకం దేశ జనాభాలో అత్యంత బలహీన వర్గాలకు అండగా నిలుస్తోంది.

**ప్రారంభం.. విస్తరణ:**

ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య హామీ 2018 సెప్టెంబర్ 23న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జార్ఖండ్లోని రాంచీలో ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడు, అది ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన గానూ పిలువబడే ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ నిధులతో నడిచే ఆరోగ్య బీమా పథకంగా చరిత్ర సృష్టించింది. ఆరోగ్య సేవల పంపిణీలో సమగ్ర విధానాన్ని అవలంబిస్తూ, ప్రాథమిక స్థాయి నుండి తృతీయ స్థాయి వరకు (నివారణ, ప్రోత్సాహం, వైద్య సంరక్షణ) వ్యవస్థను బలోపేతం చేయడం దీని లక్ష్యం. ఆయుష్మాన్ భారత్ రెండు ప్రధాన భాగాలతో కూడిన నిరంతర సంరక్షణ స్వరూపం:

**ఆరోగ్య వెల్నెస్ కేంద్రాలు:**

ఫిబ్రవరి 2018లో ప్రారంభించిన ఈ కేంద్రాలు, ఇప్పటికే ఉన్న ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలుగా రూపాంతరం చెందిస్తున్నాయి. సుమారు 1.5 లక్షల కేంద్రాల ఏర్పాటు లక్ష్యంతో, ఇవి మాతా, శిశు ఆరోగ్య సేవలు, ఉచిత మందులు, రోగ నిర్ధారణ సేవలు, అంటువ్యాధి కాని వ్యాధుల నిర్వహణతో సహా విస్తృత శ్రేణి సేవలను అందించడం ద్వారా ప్రజల ఇళ్లకు వైద్య సేవలను చేరువ చేస్తున్నాయి. ఆరోగ్య ప్రచారం, నివారణపై దృష్టి సారించడం ద్వారా ప్రజలను ఆరోగ్యంగా ఉంచడమే వీటి ప్రధాన ఉద్దేశ్యం.

**ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన:**

ఆయుష్మాన్ భారత్ యొక్క రెండవ, కీలక భాగం ఇది. దేశ జనాభాలో అట్టడుగున ఉన్న 40% మంది పేద, బలహీన కుటుంబాలకు (సుమారు 12 కోట్లకు పైగా కుటుంబాలు, అనగా 55 కోట్లకు పైగా లబ్ధిదారులు) ద్వితీయ, తృతీయ స్థాయి ఆసుపత్రి చికిత్సల కోసం ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 5 లక్షల




ఆరోగ్య కవరేజీని అందిస్తుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల సామాజిక-ఆర్థిక, వృత్తిపరమైన ప్రమాణాల ఆధారంగా లబ్ధిదారులను గుర్తించారు.

**లక్ష్యాలు:**

**దేశంలోని అత్యంత పేద, బలహీన వర్గాలకు ఆరోగ్య భద్రతను కల్పించడం.**
**ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సను అందుబాటులోకి తేవడం.**
**ద్వితీయ, తృతీయ స్థాయి ఆసుపత్రి చికిత్సల భారాన్ని తగ్గించడం.**
**ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులోకి తేవడం ద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపరచడం.**
**1.5 లక్షల ఆరోగ్య, సంరక్షణ కేంద్రాల ద్వారా సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందించడం.**

**సాధించిన ప్రగతి – విజయపథంలో మైలురాళ్లు:**

ప్రారంభించిన స్వల్పకాలంలోనే ఆయుష్మాన్ భారత్ గణనీయమైన పురోగతిని సాధించింది. డిసెంబర్ 20, 2024 నాటికి, 55 కోట్లకు పైగా లబ్ధిదారులు ₹5 లక్షల ఆరోగ్య బీమా కవరేజీని పొందుతున్నారు. ఏప్రిల్ 3, 2025 నాటికి, 31,846 ఆసుపత్రులు (ప్రభుత్వ, ప్రైవేట్) ఈ పథకం కింద నమోదయ్యాయి. 40 కోట్లకు పైగా ఆయుష్మాన్ కార్డులు జారీ చేయబడ్డాయి, 8.50 కోట్లకు పైగా ఆసుపత్రి ప్రవేశాలు నమోదయ్యాయి. సీనియర్ సిటిజన్లు (70 ఏళ్లు పైబడినవారు), ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు కూడా ఈ పథకం పరిధిలోకి వచ్చారు. ఆసుపత్రిలో చేరడానికి ముందు 3 రోజుల ఖర్చులు, డిశ్చార్జ్ అయిన తర్వాత 15 రోజుల ఖర్చులు కూడా పథకం పరిధిలోకి వస్తాయి.

**డిజిటల్ స్పర్శ:**

ఆరోగ్య సంరక్షణలో నవ శకం. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఈ పథకానికి సరికొత్త డిజిటల్ రూపాన్నిచ్చింది. ఇది రోగులు, వైద్యులు, ఆసుపత్రులను అనుసంధానించే ఒక ఏకీకృత డిజిటల్ ఆరోగ్య పర్యావరణ వ్యవస్థ. ఆరోగ్య రికార్డులను డిజిటల్గా నిర్వహించడం, ఆరోగ్య నిపుణులు, సౌకర్యాల నమోదు ప్రక్రియను సులభతరం చేయడం ద్వారా ఇది పారదర్శకతను, లభ్యతను పెంచుతుంది. ఏప్రిల్ 5, 2025 నాటికి, 76 కోట్లకు పైగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాలు సృష్టించబడ్డాయి. 5.95 లక్షలకు పైగా ఆరోగ్య సంరక్షణ నిపుణులు, 3.86 లక్షలకు పైగా ఆరోగ్య సౌకర్యాలు దీని కింద నమోదయ్యాయి. 52 కోట్లకు పైగా ఆరోగ్య రికార్డులు డిజిటల్గా అనుసంధానించబడ్డాయి.

**అమలు, నిధులు:**

జాతీయ సంకల్పానికి ప్రతిబింబం

ఈ పథకాన్ని అమలుపరిచే బాధ్యత కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ హెల్త్ అథారిటీ పర్యవేక్షిస్తుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ₹86,175 కోట్లు కేటాయించింది, ఇది ఆరోగ్య రంగానికి గణనీయమైన ప్రోత్సాహం. పథకం విజయవంతమైన అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం తప్పనిసరి. కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలు అమలులో ముందంజలో ఉండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా తమ పరిధిలో ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తున్నాయి. ఈ పథకం ప్రతి సంవత్సరం సుమారు 6 కోట్ల మంది భారతీయులు వైద్య ఖర్చుల వల్ల పేదరికంలోకి జారిపోకుండా రక్షిస్తోంది.

**సవాళ్లు, పరిష్కారాలు:**

ముందడుగు వేస్తూ గొప్ప లక్ష్యంతో ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ అమలులో కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేమి, నాణ్యమైన వైద్య సదుపాయాల కొరత, ముఖ్యంగా నిపుణులైన వైద్యులు, అధునాతన పరికరాల లభ్యత ఒక సమస్య. ప్రైవేట్ ఆసుపత్రుల పూర్తిస్థాయి భాగస్వామ్యం ఇంకా ఆశించిన స్థాయిలో లేదు. నిధుల విడుదల, మోసాల నివారణ, తీవ్రమైన వ్యాధుల చికిత్సలు పథకం పరిధిలోకి రాకపోవడం, పట్టణ-గ్రామీణ వ్యత్యాసాలు ఇతర సవాళ్లు.

**పరిష్కారాలు:**

ఈ సవాళ్లను అధిగమించడానికి పరిష్కార మార్గాలు కూడా స్పష్టంగా ఉన్నాయి. ప్రజల్లో అవగాహన పెంచడానికి స్థానిక భాషల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలి. వైద్య సదుపాయాలను మెరుగుపరచడానికి పెట్టుబడులు పెంచి, టెలిమెడిసిన్ వంటి సాంకేతికతలను విస్తృతంగా ఉపయోగించాలి. ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రోత్సాహకాలు అందించి, వారి భాగస్వామ్యాన్ని పెంచాలి. మోసాలను అరికట్టడానికి సాంకేతికత ఆధారిత నిఘా, పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. అవసరమైన అన్ని చికిత్సలను పథకం పరిధిలోకి తీసుకురావడానికి నిరంతరం సమీక్షించాలి. ఆసుపత్రుల పనితీరును అంచనా వేస్తూ, నాణ్యమైన వైద్యం అందించేలా కఠిన ప్రమాణాలు అమలు చేయాలి. పథకం అమలును పర్యవేక్షించడానికి, సమస్యలను పరిష్కరించడానికి ఒక బలమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

**ఆరోగ్య భారతావని కల సాకారం దిశగా..**

ఆయుష్మాన్ భారత్ యోజన భారతదేశ ఆరోగ్య సంరక్షణ రంగంలో ఒక చారిత్రాత్మక పథకం. దీనికి ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ తోడవ్వడం ఆరోగ్య సంరక్షణను మరింత సులభతరం, పారదర్శకం, అందుబాటులోకి తెస్తుంది. ఈ పథకం యొక్క పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడానికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు, ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాలి.

సవాళ్లను అధిగమిస్తూ, లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగితే, ఆర్థిక భారం లేని ఆరోగ్య భారతావని కల త్వరలోనే సాకారమవుతుంది. ఆయుష్మాన్ భారత్ దివాస్ సందర్భంగా, ఈ మహత్తర యజ్ఞంలో మనందరం భాగస్వాముల మవుదాం, ఆరోగ్యకరమైన, సుసంపన్న మైన భవిష్యత్తుకు బాటలు వేద్దాం.

**– జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**

## మళ్లీ జన్మించు



శ్రమజీవుల చెమటచుక్కలే
నీ హృదయాన్ని చైతన్యపరచగా
గొంతు పెగలని పేదల
అణచివేతలను ప్రశ్నిస్తూ
నీ కలంతో గళమిచ్చి
వారి ఆక్రందనలకు అక్షరరూపమిచ్చి
నేను సైతమంటూ
దోపిడీ, దౌర్జన్యాలపై
పర్జన్యమై గర్జించి,
సాహితీజగతిని
నీ పాళీతో పాలించి
సాహితీవనంలో
విరబూసిన ఎర్రమందారమా!
ఓ శ్రీ శ్రీ!
నడుస్తున్న దేశచరిత్ర సమస్తం
అవినీతిపీడన పరాయణత్వం.
నేటి పాలకులు
నరనరాల్లో నీవు నింపిన
విప్లవసిరారంగుని మార్చేస్తున్నారు
గళమెత్తినవారిపై తప్పుడు కేసులతో.
ప్రస్తుత వ్యవస్థను ఉతికారేసే
'మహాప్రస్థానం' తిరిగి మొదలెట్టుటకై,
నిరంకుశత్వపు రూపురేఖలను
నీ 'జగన్నాథ రథచక్రాల' కింద నలిపి
వాటి జాడలేకుండా చేయుటకై
మళ్లీ జన్మించవూ!

**- వేమూరి శ్రీనివాస్**
**9912128967**

## ఓయీ .. మహాకవీ

ఓయీ.. మహాకవీ శ్రీశ్రీ
మానవతా రవీ పవీ
నీకు అక్షర సుమాంజలీ
నీ కవనం ప్రభంజనం
నీ జననం స్వరాంజనం
నీ జీవితం అనంతం
అక్షర పుష్టి ప్రదాత
ఖడ్గ సృష్టి విధాత
సిరి సిరి మువ్వల సిరి
భావ సవ్వడుల కరి
ప్రాస క్రీడల ఝరి
లిమరుక్కుల గిరి
ఓ శ్రీరంగం శ్రీనివాసా
మా పద పరిమళ శ్వాసా
మా అక్షరాల ఉచ్ఛ్వాసా
ఓ మహా కవీ మా హృదయ రవీ
నీ కవన మెంతో సుందరం
నీకు అభి వందనం
ఓ సాహితీ విజ్ఞాన గనీ
విప్లవ పరిప్లవ కవితా మణీ
పరిపూర్ణ పద బంధాల ధ్వనీ
ఓ ఎరుపెక్కిన కొడవలి
మా హృదినెక్కిన పిడికిలి
నువ్వే మా అభ్యుదయ ఆస్థానం
నువ్వే మా సాహిత్య సంస్థానం
నీదే మా కవన కువ కువల స్థానం
నీ ప్రయాణమే ఓ మహా ప్రస్థానం..!
(జూన్ 30 శ్రీ శ్రీ జయంతి)

**– డా.కటుకోర్ర్వుల రమేష్**
**సెల్:9949083327**

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**– ఎడిటర్**

# చేనేత కుటుంబాలకు చేయూతనివ్వాలి



ఉత్పత్తిలో ప్రధానమైన ఉటువంటి శ్రమ శక్తికి మానవవనరుల పాత్ర పరిశ్రమలలో ముఖ్యమైనది. సాంకేతికపరమైనటువంటి మేధస్సుతోపాటు, సృజనాత్మక శక్తి సమ్మేళితంగా సాగుతున్న నేత పరిశ్రమలో అనేక కళాఖండాలకు చోటు ఉంది. ఆశించిన ఫలితాలు సదరు వర్గానికి చేకూరినా, లేకపోయినా వృత్తినే నమ్ముకొని జీవన ప్రయాణాన్ని నేత వర్గీయులు సాగిస్తారు. నేత పరిశ్రమలో అనుబంధ పరిశ్రమలు అనేకంగా వివిధ విభాగాలలో వస్త్ర ఉత్పత్తి కావిస్తూ కార్మికులు, ఆసాములు, యజమానులు అను మూడు విభాగాలలో సిరిసిల్ల నేత పరిశ్రమ కొనసాగుతుంది. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన అనేకమంది నేత వర్గీయులు సిరిసిల్లలో పరిశ్రమలపై ఆధారపడి మనుగడ సాగుతున్నారు.

గంటల తరబడి శ్రమిస్తేనే నోట్లోకి ఒక ముద్ద. సుజనాత్మక కళాకృతులను ప్రపంచానికి అందించాలనే ఒక దృఢ సంకల్పం. మగ్గాల నుంచి ఆధునిక మరమగ్గాల వరకు ఏ మిషనరీ ని ఉపయోగించినా నేతన్న చేయి లేకుంటే వస్త్రంగా ఆకృతి దాల్చదు. నాటి నుండి విభిన్న పరిణామాల అనంతరం రక రకాల వస్త్రాలుగా రూపుదిద్దుకొని, అద్దకంతో సొబగులు అద్దుకొని మార్కెట్లో ఆవిష్కరించబడుతున్నాయి. ఆ క్రమంలో అనేక సృజనాత్మక మేధస్సు తో కళలు చోటు చేసుకోవడం ఒక గొప్ప విషయం. చేతి రుమాల నుంచి మొదలుకొని పట్టు వస్త్రాల వరకు అనేక విభాగాలలో ఒక్కో ఆవిష్కరణలో ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుంటాయి. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా మర మగ్గాలు ఉన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పద్మశాలి వర్గం నేత వృత్తిని నమ్ముకొని పరి శ్రమల తో జీవనోపాధి పొందుతున్నాయి. కష్టపడి పనిచేసి చేనేత కార్మికులు కొందరు యజమానుల వరకు ఎదిగినారు. ఆ క్రమంలో అనుకూల, ప్రతికూల పరిస్థితుల కారణంతో అనేక మార్పులు సంభవించడం సిరిసిల్ల పరిశ్రమ వర్గాలలో సహజంగా ఉన్నాయి.

ఇతర వృత్తులలో కంటే చేనేత వృత్తిలో కార్మికుడు ఏకధాటిగా గంటల పాటు శ్రమను వెచ్చిస్తేనే గాని ఒక ఆకృతి ముందుకు రాదు. సునిశితమైనటువంటి డిజైన్లు, అనేక సాంకేతిక విభాగాలను మిషనరీల ద్వారా అనుబంధ పరిశ్రమల కూర్పుతో ప్రత్యేకమైనది. స్పెండల్ మిషన్లు, వార్పిండ్లు, డయింగులు, లుమ్స్, ట్విస్టింగ్ మిషన్లు, సైజింగ్లు,



ప్రాసెసింగ్ యూనిట్లు, ఫినిషింగ్ విభాగాలు ఇలా అనేకమైనటువంటివి వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తికి ప్రత్యేక మూలాలు. ఒక్కొక్క విభాగంలో పలు రకాల నైపుణ్యత కలిగిన కార్మికుల యొక్క శ్రమ ప్రత్యేకంగా ఉంటుంది. చేనేతలు ప్రత్యేక అనుభవంతో కూడిన చేనేత కార్మికుని యొక్క సృజనాత్మక ప్రత్యేకత.

కాలక్రమేణా సాంకేతిక మిషనరీ విభాగాలలో ప్రత్యేకతలు ఎన్ని వచ్చినప్పటికీ చేనేత వస్త్ర ఉత్పత్తిలో నిబద్ధతతో కూడిన కార్మిక శక్తి ఎక్కువ శాతం గా కేంద్రీకృతమైంది. సిరిసిల్ల ప్రాంతంలో తయారైన వస్త్రాలు దేశం నలుమూలల్లోకి వెళ్లి బహుళ జాతి కంపెనీల ఉత్పత్తుల పోటీకి సరసన నిలిచి 'అగ్గిపెట్టెలో చీర' ను సృష్టించిన ఘన చరిత్ర సిరిసిల్లకే దక్కింది.

యజమాని నుండి కార్మికుని వరకు మధ్యలో కలిగిన అనేక విభాగాలలో వ్యవస్థ సమ్మేళితంగా మనుగడ సాగుతున్న క్రమంలో... కార్మికులు, ఆసాములు, యజమానులు మూడు దశల్లో పరిశ్రమ విరాజిల్లుతుంది. మొదటగా కొన్ని ఏళ్ల శ్రమతో కార్మికుడిగా మొదలై ఆసాములుగా, యజమానులుగా ఎదిగిన వారు ఉన్నారు. కుటీర పరిశ్రమలోని అనేక మూలాలలో వారి మధ్య అనుబంధం కనిపిస్తుంది. నేతవృత్తిని నమ్ముకున్న కుటుంబాలలో ఇంటిల్లిపాది శ్రమించి వస్త్రోత్పత్తిలో భాగమవడం సిరిసిల్ల నేత పరిశ్రమలో ఒక ప్రత్యేకం.

**వృత్తినే నమ్ముకుని ఏళ్లుగా పోరాటం**

పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన సిరిసిల్ల నేత వర్గంలో అనేక ఏళ్లుగా ఉత్పత్తిలో మందంను అనేకసార్లు ఎదుర్కొన్నారు. అయినా వాళ్లు నమ్ముకున్న వృత్తిని వీడలేదు.

చేనేత బతుకు జీవన పోరాటంలో నిత్యం ఒక ఆవిష్కరణ కోసం అన్వేషణ జరుగుతూనే ఉంటుంది. ఆనాడు చేనేత మగ్గం ద్వారా ఉత్పత్తి గావించి అనేక అద్భుతాలు సృష్టించారు. నేడు ఆధునిక రేపర్ లూమ్స్ పై కూడా వారి మార్కును చాటుకున్నారు. కాల క్రమేనా అనేక కొత్త ఉత్పత్తి యంత్రాలు రూపు దాల్చుకున్ననూ మార్కెట్ ఎగుడు దిగుడు పరిస్థితులను ఎదుర్కోవడం వారికి తప్పలేదు. అందుకు ప్రత్యేక కారణంగా ఒకసారి పరిశీలిస్తే దేశంలో బొంబాయి, సూరత్, సోలాపూర్, అమ్మదాబాద్, గుజరాత్, భీవండి లలో వస్త్ర ఉత్పత్తి కేంద్రీకృతమైన విషయం అందరికీ తెలిసినదే. సిరిసిల్ల వస్త్ర ఉత్పత్తి పరిశ్రమతో దేశంలో ప్రసిద్ధి చెందిన వస్త్ర ఉత్పత్తి కేంద్రాలను పోల్చి చూస్తే అనేక వ్యాపార ఉత్పత్తి విభాగాలు భిన్నంగా ఉంటాయి. అందుకు ప్రత్యేక కారణంగా చెప్పాలంటే సిరిసిల్లకు రవాణా సదుపాయాలలో రైలు మార్గం లేకపోవడం, పెద్ద మార్కెట్లకు అనుసంధానంగా లేకపోవడం ఇది ఒక వెనుకబాటు అని చెప్పవచ్చు. ముడి సరుకులు కానీ, తయారైన ఉత్పత్తులు కానీ ఎగుమతి దిగుమతి విషయంలో నేరుగా సంబంధాలు పెద్ద మార్కెట్లతో లేకపోవడం జరుగుతుంది. తయారైన గుడ్డను ఇతర రాష్ట్రాల మార్కెట్లలోకి నేరుగా గతంలో, ప్రస్తుతం ఎగుమతి చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు దక్కకపోవడం గమనార్హం. సిరిసిల్ల నందు అనేక గార్మెంట్లతో పాటు, టెక్స్ టైల్ పార్క్, అపెరల్ పార్కు కలవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్.వి.ఎం, చీరల తయారీ, మ్యాక్స్ సొసైటీలు, నూలుడిపో ఇలా సిరిసిల్ల నేత వర్గాలకు ఇచ్చి ఊరట కలిగించాయి. మరిన్ని పథకాలను కూడా ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త విధానాలను కూడా సిరిసిల్ల నేత వర్గానికి అందివ్వడం ప్రభుత్వాలు చేస్తున్న కృషికి నిదర్శనం. నైపుణ్యత,కళాత్మకతలతో పాటు వృత్తిపై బాధ్యతతో శ్రమించి పనిచేసే తత్వం కలిగిన నేత వర్గానికి ఆదరించే అవకాశాలు, పథకాలు పెద్దపీట వేస్తున్నాయి. నేత వర్గానికి అన్ని వర్గాల నుండి ఆదరణ లభించాలని ఆశిద్దాం.

**– డా. చిటికెన కిరణ్ కుమార్**
**9490841284**

## వేస్ట్! వేస్ట్!!వేస్ట్!!!



ఒక మాట బయలుదేరింది
లక్షలాది గొంతుకలు స్వరం కలిపి
నలు దిక్కుల ప్రతిధ్వనించినవి!

వేస్ట్! వేస్ట్!వేస్ట్ అని
మూడుసార్లు అన్నాక
బంధం ఏదో తెగిపోయినట్లే ఉంది!

ఆశ పెట్టడం ఎవరికైనా సులభం
నెరవేర్చడం శక్తికి మించినప్పుడు
నిరాశ నిప్పైతది సకల జనుల సమ్మెతది!
పాలన ఎప్పుడు
పంట పొలానికి కావలి మాత్రమే కాదు
సారవంతమైన నేల కూడా కావాలి!

అనేకానేక సాధనాల వల్ల
ఎవరేమిటో తెలుసుకోవడానికి
ఇప్పుడు పెద్ద సమయం అక్కరలేదు!

ఎల్లని సంసారాన్ని
ఆవలి తీరం చేర్చే వారికి
దార్శనికత కొరవడితే ప్రమాదం!

ఉన్నదమ్మి
దినబత్యాలకు వెచ్చించే వారిని
సమర్థులనరు!!
ఉన్న భవనానికి సున్నమేయలేక
ఎవడు కట్టమన్నాడు ఇంత పెద్ద భవంతని
పూర్వీకులను నిందించడం మహా పాపం!!

**– కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
**9440233261**

# ప్రజాప్రతినిధులను రీకాల్ చేయాలి

సార్వత్రిక ఎన్నికల్లో 'అసెంబ్లీ'లోకసభ సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు గెలిచిన తర్వాత తాము ఎన్నికల సమయంలో ఓటర్లకు ఇచ్చిన వాగ్దానాలు హామీలు మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను నిర్ణీత కాల వ్యవధిలో అమలు చేయడంలో విఫలమైతే చట్ట సభకు ఎన్నికైన అభ్యర్థి అధికార దుర్వినియోగానికి అవినీతికి పాల్పడితే ఎన్నుకున్న నియోజక వర్గ 'ఓటర్ల కౌన్సిల్'గా ఏర్పడి ప్రజాభిప్రాయం ద్వారా పదవీచ్యుతున్ని చేసే 'రీకాల్ చేసే విధానాన్ని' అమలు చేయడానికి ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణ చెయ్యాలి. అభివృద్ధి చెందిన దేశాలలో రీకాల్ విధానం అమలులో ఉంది. ఆ దేశాలలో చట్టసభ సభ్యుల్లో పారదర్శకత జవాబు దారీతనం వుండడం వల్ల సుపరిపాలన 'సుస్థిరాభివృద్ధి సంక్షేమం' ప్రగతి, పురోగతి పరుగులు పెడుతుంది. ఎన్నికల సంఘం పరిధిలోకి చేర్చి చట్ట ప్రకారం నేర చరితుల అభ్యర్థిత్వాన్ని రద్దు చేసే సమగ్రమైన ఎన్నికల సంస్కరణలు న్యాయ సంస్కరణలు చేపట్టే అధికారం సి.ఇ.సికి దఖలు పరచాలి. చట్ట సభలకు ఉత్తమ ప్రజా ప్రతినిదులు ఎన్నిక కావటానికి న్యాయ పాలన సంస్కరణలు ప్రభుత్వం చేపట్టాలి .

ప్రతి రాజకీయ పార్టీఎన్నికలకు 6 నెలల ముందు ఆధునిక డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉత్తమ అభ్యర్థుల గుర్తింపు ఎంపిక కొరకు నియోజక వర్గ ఓటర్ల అభిప్రాయాలను సేకరించాలి. ఓటర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి. నియోజక వర్గంలో ఓటర్ల ప్రథమ ప్రాధాన్యం పొందిన అభ్యర్థికి టికెట్లు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తే టికెట్ కొరకు డబ్బులు ఇచ్చి కొనుక్కునే సంస్కృతికి తెరబడుతుంది. మేధావులు రాజ్యాంగం పట్ల చట్టాల పట్ల అవగాహన వున్న రాజనీతి వేత్తలు చట్ట సభలకు ఎన్నికై మెరుగైన సమాజ ఆవిర్భావానికి దోహదపడే అవకాశాలు ఏర్పడతాయి. ప్రజా విశ్వాసం వున్న వ్యక్తులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైతే రాజ్యాంగ లక్ష్యాలు ఉద్దేశాలు నెరవేరి సమాజం సమగ్ర అభివృద్ధి జరుగుతుంది. ఈ విధానం ద్వారా ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని రాజకీయాలలో ధనికులు ప్రాబల్యాన్ని, కార్పొరేట్ సంస్థల అధినేతల



ప్రవేశాన్ని అడ్డుకోవచ్చు. ఓటర్లు సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉండేలా ఎన్నికల సంఘం వెబ్‌సైట్లలో అన్ని అంశాలను పొందుపరచాలి. ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు వేసే పరిస్థితులు సి.ఇ.సి కల్పించాలి. అప్పుడే ఓటరు సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుంది. గెలిచిన అభ్యర్థి అవినీతికి పాల్పడినట్లైతే ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఓటర్లు రీకాల్ చేసుకొని మరొకరిని ఎన్నుకునే వెసులుబాటు కల్పించాలి. దీనివల్ల అధికార దుర్వినియోగం, రాజకీయ అవినీతిని అరికట్ట వచ్చును. ప్రస్తుతం కొన్ని దేశాల్లో 'రీకాల్ సిస్టమ్'అమలులో ఉంది. ఇలాంటి దేశాలలో మాత్రమే సుపరిపాలన పరుగులు పెడుతుంది. ప్రభుత్వం మెరుగైన ప్రజా ప్రాతినిధ్య చట్టాల కోసం రాజ్యాంగ నసవరణ చెయ్యాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల నియామకం కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ నిర్వహించిన అర్హత పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఉద్యోగాల్లో నియమించిన విధంగా ప్రభుత్వం 'అల్ ఇండియా పొలిటికల్ సర్వీస్ కమిషన్' ఏర్పాటు చేసి పరీక్షల్లో అర్హత పొందిన అభ్యర్థులు మాత్రమే సార్వత్రిక ఎన్నికల్లో చట్ట సభలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేసే విధంగా విధి విధానాలు రూపొందించాలి.

మేధావులు యువత రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషించాలి. యువత తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఆసక్తి చూపాలి. సమర్థులను చట్ట సభలకు సభ్యులుగా ఎన్నుకోవాలి. జాతి తల రాతను మార్చేది రాజకీయాలే అన్న స్పృహ ఓటర్లలో ముఖ్యంగా యువతలో కలుగాలి. దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచే శక్తి యువతరానిదే అన్న వాస్తవాన్ని విస్మరించరాదు. యువత దేశ భవిత అన్న వాస్తవాన్ని మరువరాదు. యువత నవ రాజకీయాలకు నేతృత్వం వహించి ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్య లక్ష్యాల సాధనకు పునరంకితం కావాలి .

**– నేదునూరి కనకయ్య**
**9440245771**

## నూతన జిహెచ్ఎంసి కమిషనర్‌ని కలిసిన బీసీ తిప్పర్తి యాదయ్య



రంగారెడ్డి,ఏప్రిల్29(మనం న్యూస్): జిహెచ్ఎంసి నూతన కమిషనర్ గా నియమితులైన ఆర్.వి కర్ణన్ కు హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ సిహెచ్ కృష్ణ, రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ మంద రవి, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు, సెక్రటరీ మురళి, హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ బలరాం, సూపరింటెండెంట్ మహేందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పహల్గాం మృతులకు నివాళులర్పించిన న్యాయవాదులు



కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29( మనం న్యూస్): జమ్మూ కాశ్మీర్లోని పహల్గాలో ఉగ్రవాదులు పర్యాటకులపై జరిపిన కాల్పుల్లో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని న్యాయ వాదులు మంగళవారం రెండు నిమిషాలుమౌనం పాటించారు.అనంతరం ఒకే దేశం -ఒకే ఎన్నికపై సాయిని మల్లేశం అడ్వకేట్ ఆధ్వర్యంలో చర్చగోష్టి నిర్వహించారు, దేశంలోని అన్ని రాష్ట్రాలలో పార్లమెంటుకు శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరగడం ద్వారా దేశంలో ఎన్నికలకు, ఖర్చు తగ్గుతుందని, తరచుగా ఎన్నికలు జరగడం ద్వారా అభివృద్ధి నిలిచిపోతుందని, దేశంలోని అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకొని చేయాలని అభిప్రాయపడ్డారు, ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కొరివి వేణుగోపాల్ ,కోమాల ఆంజనేయులు, చందూరి భూమి రెడ్డి, దాసరిరామ్ రెడ్డి, రఘునందన్ రాజు, బండారు శ్రీనివాస్, గంట సతీష్, చంద్రమౌళి, ఆనంద్, ప్రవీణ్, రెండు ప్రధానులు విశ్రాంత ఉపాధ్యాయులు నరహరి లక్ష్మారెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు

## ఇంద్రసేనారెడ్డికి ఘన సన్మానం



ఎల్బీనగర్, ఏప్రిల్ 29 (మనం న్యూస్) త్యాగరాయ జ్ఞాన సభ నందు జరిగిన ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్సమావేశం లో 301 చిత్ర లే అవుట్ ఎల్బీనగర్ ప్రధాన కార్యదర్శి పి. ఇంద్ర సేనారెడ్డి నీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో 301. డిస్టిక్ గవర్నర్ లింగ ప్రసాద్, పాస్ట్ గవర్నర్ లు వెంకటా చారీ , చక్రపాణి , కాబినెట్ సెక్రటరీ గంగాధర్ రెడ్డి , యస్. రామ చంద్ర రావు వైస్ ప్రెసిడెంట్ చిత్ర లే అవుట్ వాకర్స్ క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు..

# కాప్రా సర్కిల్లో అక్రమ నిర్మాణాల జోరు..

- అక్రమ బహుళ అంతస్తు నిర్మాణాలు ఆపై పెంట్ హౌస్ నిర్మాణం ..
- అధికారులను కలిసామంటున్నా అక్రమ నిర్మాణ దారులు..
- స్థానిక రాజకీయ నాయకుల అండతో..

కాప్రా సర్కిల్, ఏప్రిల్ 29 (మనం న్యూస్) : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా సర్కిల్ లో అక్రమ నిర్మాణాలు ఏదేచ్ఛగా కొనసాగుతున్నాయి. అక్రమ బహుళ అంతస్తు నిర్మాణాలు ఎదెచ్ఛగా నిర్మిస్తున్నారు. విచిత్రమేమిటంటే అక్రమ నిర్మాణం అని తెలిసినా కూడా టౌన్ ప్లానింగ్ అధికారి, చైన్ మెన్ లు అటువైపు రాక పోవడంలో ఆంతర్యం ఏమిటని? స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రభుత్వం కోసం విధులు నిర్వహిస్తున్నారా? లేక పై ఆదాయం కోసం పనిచేస్తున్నారా? అనే విషయం వెయ్యి డాలర్ల ప్రశ్నగా మారింది. అక్రమ నిర్మాణం అని తెలిసి కూడా, అధికారులు అటువైపు రాకుండా నిర్మాణదారులకు కొమ్ము కాస్తూ అక్రమ సంపాదననే ధ్యేయంగా పనిచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న వీరి పనితీరు సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అధికారులను కలిసాం అంటున్న అక్రమ నిర్మాణ దారులు?**

కాప్రా సర్కిల్ లోని హెచ్బి మీర్పేట్ హౌసింగ్ బోర్డు కాలనీలోనీ యాదగిరి ఫంక్షనల్ హాల్ సమీపంలో అనుమతులకు మించి బహుళ అంతస్తుల నిర్మాణాలు, పద్మశాలి టౌన్షిప్ లో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు, కమలా నగర్ లో అక్రమ నిర్మాణాలు, నేతాజీ డిఫెన్స్ కాలనీలో అక్రమ షెడ్ల నిర్మాణాలు చేపడుతూ .. ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పెడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి, అక్రమ నిర్మాణదారుడు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారిని కలిసామని సన్నిహితులతో బహిరంగానే అనడంపై సర్వత్ర విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణానికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని? ధైర్యంగా చెప్పుకోవడంలో అధికారులకు ఎంత పెద్ద మొత్తంలో ముడుపులు పై స్థాయి నుంచి కిందిస్థాయి వరకు ముట్టాయో? చెప్పనక్కరలేదు. ప్రతి కాలనీలో ఒక రాజకీయ నాయకుడి అండదండలతో అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నారనీ, నాయకుడి ద్వారా టౌన్ ప్లానింగ్ అధికారులు ఒప్పందాలు జరుపుకొని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారనీ, అక్రమ నిర్మాణం పై ఎవరికి ఎంత ఇవ్వాలో ? మున్సిపల్ అధికారులే ఉచిత సలహాలు ఇస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తారని విమర్శలు వినిపిస్తున్నాయి. కాప్రా సర్కిల్లో ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా అధికారులపై బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్న, అధికారుల తీరు మారడం లేదని, అధికారులకు పలుమార్లు ఫోన్ చేసిన కూడా స్పందించకపోవడం గమనార్హం!. కొందరు స్థానికులు బహిరంగంగానే మున్సిపల్ సిబ్బందికి పెద్ద మొత్తంలోనే ముడుపులు ముట్టి ఉంటాయని, అందుకే అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**కార్యాలయంలో అందుబాటులో లేని టౌన్ ప్లానింగ్ అధికారి, సిబ్బంది ?**

తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎల్ఆర్ఎస్ లో భాగంగా సిబ్బంది కొరతతో పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తించ కుండా పోతున్నామని, పూర్తిస్థాయి సమయాన్ని కేటాయించడంలో సిబ్బందికి ఇబ్బంది గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఏది ఏమైనా అక్రమ నిర్మాణాలపై నోటీసుల పేరుతో కాలయాపన చేయకుండా కఠినమైన చర్యలు తీసుకొని ప్రభుత్వానికి ఆదాయం పెంచాలని స్థానికులు కోరుతున్నారు.



## గొర్రెలను దొంగిలించిన వారిపై కఠినంగా శిక్షించాలి

- జిఎంపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్



రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 29( మనం న్యూస్): కోహెడ గ్రామం సందర్శించిన జిఎంపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి అమీర్పేట మల్లేష్ మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు బాధిత రాసూరి శ్రీశైలం కుటుంబాన్ని పరామర్శించి, కామినేని హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ నవీన్ ను కలిసి ధైర్యం చెప్పారు. బాధితులతో కలిసి హయత్ నగర్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ ని బృందం కలిసి వారు మాట్లాడుతూ, హైదరాబాద్ చుట్టుపక్కల రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి జిల్లాల గ్రామాల్లో గొర్రెల దొంగతనాలు బాగా జరుగుతున్నాయని కోహెడ గ్రామ పరిధిలో ఇప్పటికే 10సార్లు దొంగతనాలు జరిగాయని పోలీసు అధికారులకు పిటిషన్లు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. దొంగలను అడ్డుకుంటే ప్రాణాలు తీస్తున్నారని, దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, పోలీస్ పెట్రోలింగ్ వాహనాల సంఖ్య పెంచి సీ.సీ. కెమెరాల ఏర్పాటుతో సామూహిక గొర్రెల షెడ్లును నిర్మించి బాధిత కాపరులకు నష్టపరిహారం చెల్లించాలని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని గొర్రెలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ చేయించాలని వారు డిమాండ్ చేశారు.హయత్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ స్పందిస్తూ రెండ్రోజుల్లో ఖచ్చితంగా దొంగలను పట్టుకుంటామని, కఠిన శిక్ష పడేలా కృషి చేస్తామని జిఎంపిఎస్ జి. నాయకులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ యాదవ్, వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ జి. నర్సింహ్మా, జిఎంపిఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి అమీర్ పేట్ మల్లేష్, జిల్లా నాయకులు దొడ్డి క్రిష్ణ, బర్ల మల్లేష్, అచ్చన రమేష్, చిన్నింగి బాలరాజు, మల్లేష్, శ్రీశైలం మరియు బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అసౌకర్యం కలవకుండా పనులు త్వరగా పూర్తి చేయాలి

- ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ



రంగారెడ్డి, ఏప్రిల్ 29 (మనం న్యూస్): ఆర్కె పురం డివిజన్ హరిపురి కాలనీ రోడ్ 1 లో డ్రైనేజీ పనులను ప్రజలకు అసౌకర్యం కలవకుండా త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలు డ్రైనేజీ సమస్య తో ఇబ్బంది పడుతున్నారని కాలనీ అసోసియేషన్ సభ్యులు గత ఎన్నికల ముందు మాజీ మంత్రి , మహేశ్వరం నియోజకవర్గం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకురాగా అధికారులను ఆదేశించడంతో వెంటనే రూ . 20 లక్షల రూపాయల తో టెండర్ శాంక్షన్ చేశారు. అయొక్క పనులు మంగళవారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డ్రైనేజీ పూర్తి ఐతే సంవత్సరాలుగా పడుతున్న మురుగునీరు ఇబ్బందులు పోతాయని అని అన్నారు .సహకరించిన ఎమ్మెలే , స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లో గౌడుగు శ్రీనివాస్,శ్యాంగుప్తా ,కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్ గుప్త,జనరల్ సెక్రటరీ నోముల మురళి, కృష్ణమూర్తి,ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రావు,యాదగిరి,వంశీ,అనిలకుమార్,యాదగిరి రెడ్డి,సుంకర రవి,రంగాచారి పాల్గొన్నారు.

## జై బాపు జై భీమ్ జై సంవిధన్..పాదయాత్రలో కాంగ్రెస్ నేతలు




మేడిపల్లి ఏప్రిల్ 29 (మనం న్యూస్) : ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు, మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేశారు.భారత రాజ్యాంగాన్ని, అంబేద్కర్ను కాపాడుకుందాం..బిఆర్ అంబేద్కర్ ను అవమాన పరిచే విదంగా చేస్తున్న వ్యాఖ్యలకు నిరసిస్తూ..భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ను, మన రాజ్యాంగాన్ని అవమానించే బీజేపీ, దాని అనుబంధ సంస్థలు దాడులు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఈ దాడులను క్షేత్రస్థాయి నుంచే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ అంబేద్కర్ను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం అందేలా ప్రభుత్వం కృషి చెస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు ప్యాక్స్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ మాకిలి ఇజ్రాయిల్, మార్కెట్ కమిటి డైరెక్టర్ బలగం రాజేష్, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు మేధారి లాజర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉమ్మడి రవి, జిల్లా నాయకులు ఉరుమడ్ల లక్ష్మన్, మాజీ సర్పంచ్లు బొంగోని రాజగౌడ్, కొంద్ర గంగాధర్ ఉరుమడ్ల నర్సయ్య, గడ్డం నారాయణ రెడ్డి మాజీ ఎంపీటీసీ దాసరి శంకర్, మాజీ ఉప సర్పంచ్ నూతిపెల్లి శంకర్, సోషల్ మీడియా ఇంచార్జ్ డప్పు ప్రేమ్ సాగర్, సీనియర్ నాయకులు , శ్రీపతి దామోదర్, కటి పెల్లి దసారథ రెడ్డీ, నల్ల నారాయణ రెడ్డి, కుంటా నారాయణ రెడ్డి, మేధారి రాజన్న రాఘవ రెడ్డి, రావు శ్రీనివాస్ రావు, ధోనిపల శంకర్, దామెర సల్మాన్, నల్ల జీవన్ రెడ్డీ, ఎడమల రాజేందర్ రెడ్డీ, నారాయణ రెడ్డీ, ముఖ్య కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదిరులు పాల్గొన్నారు.

# సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

- ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి



రంగారెడ్డి, ఏప్రిల్ 29 (మనం న్యూస్): వరంగల్ ఎల్కతుర్తి లోని సభను పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలను మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి తెలియజేశారు. మంగళవారం మీర్పేటలోని క్యాంపు కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గంలోని ఓకే నాయకులతో కృతజ్ఞత సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగాన్ని విని ప్రజలందరూ ఎంతో సంతోషించారని అన్నారు. ప్రభుత్వము ఎన్ని ఇబ్బందుల గురిచేసిన సభ ఎంతో విజయవంతమైందని అన్నారు. కెసిఆర్ సభలో కార్యకర్తలందరికీ భరోసా ఇచ్చారని అన్నారు. ఈ మూడేళ్లు ప్రజల పక్షాన పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. రెట్టింపు ఉత్సాహంతో పని చేద్దామని తెలిపారు. మన ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాలే ప్రజలకు అందుతున్నాయని , ఈ కాంగ్రెస్ ప్రభుత్వము ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. మంచి పని చేసే వారికి భగవంతుడు ఎప్పుడూ సహకరిస్తాడని, అందుకే సభ జరిగేనాడు చల్లని వాతావరణం ఉందని అన్నారు. మన పార్టీ అని కమిట్మెంట్ తో కార్యకర్తలు పని చేసి సభను సక్సెస్ చేశారని అన్నారు. వాళ్ల పార్టీ వాళ్లే ముఖ్యమంత్రి పేరుని మర్చిపోతున్నారని అన్నారు. నక్సలైట్ల సమస్యపై కూడా కేసీఆర్ సభలో ప్రస్తావించడంతో ప్రభుత్వంలో కూడా కదలిక వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలు ఏమయ్యా అని ప్రశ్నిస్తే కూడా సమాధానాలు చెప్పే స్థితిలో మంత్రులు ,నాయకులు లేరు అని అన్నారు. ఏ ఎన్నికలు జరిగిన బిఆర్ఎస్ జండా ఎగరాలన్నారు. ఈ ప్రభుత్వం అరాచకాల పాల్పడుతుందన్నారు. రైతుబంధు, రుణమాఫీ ఇంకా కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వివిధ మండలాలు అధ్యక్షులు, కార్పొరేటర్లు, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు



రంగారెడ్డి ఏప్రిల్ 29 (మనం న్యూస్): మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ లోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ(ఏకోనత్రింషత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవములు మంగళవారం కన్నుల పండుగగా జరిగాయి. లక్ష్మి నారాయణ ఇష్టి హవనం, హంసవాహనసేవ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయని ఆలయ చైర్మన్ సోమ సురేష్ కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ను దృష్టిలో ఉంచుకొని మంచినీరు, మజ్జిగ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గౌరిశెట్టి అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంధి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రవణ్ , శ్రీధర్, రామ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకే వక్ఫ్ రికార్డులు అప్లోడ్ చేస్తున్నాం

- పదోన్నతిపై దురాశతో నిరాధార ఆరోపణలు
- అర్చీస్,రీసెర్చ్ డైరెక్టర్ జరీనా పర్వీన్

హైదరాబాద్, మనం బ్యూరో : పదవిపై దురాశతో తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అర్చీస్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ జరీనా పర్వీన్ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు ఆమె మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. డిప్యూటీ డైరెక్టర్ మహేశ్ రెడ్డి కేవలం పదోన్నతి కోసం మీడియాకు తప్పుడు సమాచారం మీడియాకు ఇవ్వడం ద్వారా ఈ శాఖ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి మైనార్టీ వ్యవహారాల శాఖ ప్రభుత్వ కార్యదర్శి సూచనల ప్రకారం...భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు వక్ఫ్ బోర్డు డాక్యుమెంట్లు సెంట్రల్ వక్ఫ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. వక్ఫ్ బోర్డు రికార్డుల కోసం అన్ని ముంతఖాబ్‌లు, గెజిట్‌ల ధృవీకరించబడిన కాపీలను జారీ చేయమని అర్కైవ్స్ లేఖ నం.ఎఫ్.నం.ఎస్32/కెటిఏక్యుఎఫ్/2024 తేది 05-10-2024, ఎఫ్.నం.ఎస్-34/కెటిఏక్యుఎఫ్/2024 తేది 02-11-2024 ద్వారా అభ్యర్థించిందని పేర్కొన్నారు. ఈ డాక్యుమెంట్లన్నీ ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 76,77 ప్రకారం పబ్లిక్ డాక్యుమెంట్లు, జారీ చేయడానికి బాధ్యత వహిస్తాయన్నారు. న్యూఢిల్లీలోని నూర్ మైక్రోఫిల్మ్ ఇంటర్నేషనల్ సెంటర్ గురించి రాష్ట్ర అర్కైవ్స్ పాత పర్షియన్ రికార్డులను కాపాడటానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ, తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన తరువాత సంతకం చేసిన ఒక అవగాహన ఒప్పందం కింద ఇది పనిచేస్తుందన్నారు. అరుదైన మాన్యుస్క్రిప్ట్‌లు, పుస్తకాలను సంరక్షించడానికి ఎన్ఎంఐసీ ప్రస్తుతం తెలంగాణ హెరిటేజ్ డిపార్ట్‌మెంట్‌తో ఒక అవగాహన ఒప్పందం కింద పనిచేస్తుందన్నారు. వారు ఇప్పటికే నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియాతో సహా భారతదేశంలోని 48 సంస్థలలో తమ సేవలు అందించారని ఈ సందర్భంగా జరీన్ పర్వీన్ స్పష్టం చేశారు.

## గ్రామీణ ప్రాంతాలలో వేసవి శిక్షణ శిబిరాలు



హైదరాబాద్, ఏప్రిల్ 29(మనంన్యూస్): మంచిర్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో వేసవి శిక్షణ శిబిరాలను 10 క్యాంపులలో నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ ఆఫీసర్ కే రాజ్ వీర్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరాల క్యాంపులు మే 1 నుంచి జూన్ 6 వరకు జిల్లాలోని వివిధ మండల కేంద్రాల్లో , గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారము స్టూడెంట్స్ బాల, బాలికలను అప్లికేషన్ రిజిస్ట్రేషన్ ఎన్‌రోల్‌మెంట్ చేయించాలని సంబంధిత జిల్లాలోని ఇతర సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. బాలబాలికలకు 14 సంవత్సరాలకు వయసు ఉండాలని, క్యాంపుకు కావలసిన మెటీరియల్ ఎస్ఏటిజి అధికారులు పంపించడం జరుగుతుందని, ప్రారంభం రోజు మాత్రము ఉన్న మెటీరియల్తో ప్రారంభిస్తారని , ఈ క్యాంపులలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు . ఈ వేసవి శిక్షణ శిబిరం ఆన్లైన్ రిజిస్ట్రేషన్ వివరాలు ఇతర ఎలాంటి సౌకర్యం,సమాచారం కోసం బాక్సింగ్ కోచ్ ఎస్. రాజేష్ మొబైల్ నెంబర్ 9963539234 ను సంప్రదించాలని, అలాగే రిజిస్ట్రేషన్ లో సమస్యలు వచ్చినట్లయితే ఎస్ఏటిజి అధికారులకు ఇచ్చిన మొబైల్ నంబర్లను సంప్రదించాలని కోరారు. మండలాల్లో నిర్వహిస్తున్న క్రీడల అంశాలను,కోచ్ ల వివరాలను అయన తెలిపారు. జిల్లాలోని జన్నారం మండలంలో వాలీబాల్ క్రీడకు కోచ్ గా ఎండి యాకూబ్, కోటపల్లి మండలంలో వాలీబాల్ కోచ్ గా డి కమల్, అథ్లెటిక్స్ ను భీమారం మండలంలో టి రామచంద్రర్ కోచ్ గా ఉంటారని తెలిపారు. అలాగే వేమనపల్లి మండలం నీల్వాయిలో అథ్లెటిక్స్ కు డాక్టర్ మల్లేష్ కోచ్ గా, కాసిపేట మండలంలో కరాటే కు వి రవి, కోటపల్లి కోటపల్లి మండల కేంద్రంలో హ్యాండ్ బాల్ కు జై కళ్యాణ్, వెన్నెల మండల కేంద్రంలో ఫుట్ బాల్ కు ఎం వనిత, వేమనపల్లి మండలం నీల్వాయిలో కోకో క్రీడకు డాక్టర్ మల్లేష్, బెల్లంపల్లి మండలం తాళ్ల గురజాలలో తక్వాండో క్రీడకు ఎస్ చిరంజీవి, కోటపల్లి మండలం పారిపెల్లి లో కబడ్డీ కి ప్రేమ్ కుమార్ లు కోచులుగా వ్యవహరిస్తారని స్పోర్ట్స్ అధికారి వివరించారు.

# భూమి హక్కులు ఉండి రికార్డుల్లో లేని వారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవాలి

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, ఏప్రిల్ 29 ( మనం ప్రతినిధి ):** మీ సేవా కేంద్రంలో భూ సమస్యలపై దరఖాస్తు సమర్పిస్తే భూ భారతి చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, భూ భారతి చట్టం పై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులను జిల్లాలో ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా మంగళవారం డోంగ్లీ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మద్నూర్ రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెక్షన్ 4 ప్రకారం హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉండి రికార్డుల్లో లేని వారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరంలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. సెక్షన్ 5 ప్రకారం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసుకోవచ్చని తెలిపారు. సెక్షన్ 6 ప్రకారం సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని, 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామ ద్వారా కొనుగోలు చేసిన క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్ , స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. అట్టి వాటిని రికార్డులలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ తరహాలో రైతులకు భూదార్ కార్డుల జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ధరణీలో అప్పీలు కు ఆస్కారం లేనందున సివిల్ కోర్టుకు వెళ్ళవలసి ఉండేదని, ప్రస్తుతం తహసీల్దార్ ఇచ్చిన తీర్పులో అభ్యంతరం ఉంటే ఆర్డీఓ కు, ఆర్డీఓ తీర్పులో అభ్యంతరం ఉంటే కలెక్టర్ కు అప్పీలు. చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. హక్కుల రికార్డుల్లో ఉన్న వ్యక్తి లైసెన్సు గల సర్వేయర్ తో భూమి సర్వే చేయించుకొని మ్యాప్ తయారు చేయించుకున్నట్లయితే మండల సర్వేయర్ సరి చూసిన తర్వాత తహసీల్దార్ పాసుపుస్తమలో సర్వే మ్యాప్ ను ఉంచడం జరుగుతుందన్నారు. ఏ మైన భూ సమస్య ఉంటే సదరు పార్టీలకు నోటీసులు జారీ చేయాలని ఎవిడెన్స్ రికార్డు చేయాలనీ స్పీకింగ్ ఆర్డర్స్ స్పష్టమైన రీమార్కులతో నమోదు చేయాలని తెలిపారు. ప్రస్తుతం మీ సేవలో దరఖాస్తు పెడితే భూ భారతి చట్ట ప్రకారం విచారణ చేపట్టి నిర్ణీత సమయంలోగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలపై విచారణ చేసి స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టం లింగంపేట్ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుచున్నదని తెలిపారు. సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ., భూములకు సంబంధించిన సమస్యలకు చట్టం వచ్చిన ఒక సంవత్సరంగా దరఖాస్తు సమర్పించాలని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిల్లో పరిష్కారం చేసుకోవచ్చు అని తెలిపారు. సాదాబైనామా, మ్యుటేషన్, సక్సెషన్, వంటి అంశాలపై వివరించారు. ఆయా అవగాహన సదస్సులలో పలువురు రైతులు ప్రసంగించారు. అంతకుముందు చట్టం పై రూపొందించిన వివరాలను ఆయా తహసీల్దార్లు వివరించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు భూ భారతి పై రూపొందించిన వీడియో ప్రదర్శించారు. ఈ సదస్సులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, పాక్స్ చైర్మన్లు, ఆయా మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు, పలువురు ప్రజలు, పాల్గొన్నారు.

## పట్టా పాస్ పుస్తకాల్లో త్వరలోనే భూమి మ్యాపులను ఇస్తాం..



- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**కామారెడ్డి, ఏప్రిల్ 29 ( మనం ప్రతినిధి ):** పట్టా పాస్ పుస్తకాల్లో త్వరలోనే భూమి మ్యాపులను ఇస్తామని, అటవీ భూముల సమస్యలనూ పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూభారతి పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని షెట్ పల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూభారతి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్, ఎంపీ సురేశ్ షెట్కార్ తో కలిసి మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది నెలల మేథోమథనం, అందరి సలహాలు, సూచనలు తీసుకున్న తరువాత భూభారతి చట్టాన్ని రూపొందించామని తెలిపారు. కేసీఆర్ తను చెప్పించే చట్టంలా ధరణి తెచ్చి పేదల భూములు లాక్కొగా, తాము అంబేడ్కర్ స్ఫూర్తితో రోల్ మోడల్ గా ఉండేలా చట్టాన్ని రూపొందించామన్నారు. రెవెన్యూ యంత్రాంగమే భూ సమస్యలను పరిష్కరిస్తుందని, పదిహేను రోజుల్లో గ్రామ రెవెన్యూ అధికారులను నియమిస్తామని అన్నారు.అలాగే ఆరువేల మంది ప్రైవేట్ సర్వేయర్లకు త్వరలో శిక్షణ ఇచ్చి లైసెన్సులు ఇస్తామన్నారు. మే 5లోగా ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరుచేస్తామని, ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ ఓర్వలేకపోతోందని, మళ్లీ వచ్చేది ఇందిరమ్మ కాంగ్రెస్ ప్రభుత్వమేనని పొంగులేటి అన్నారు.

# భూ భారతి చట్టం రైతులకు చుట్టం

- జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగరాజ్ గౌడ్



**బీబీపేట్, ఏప్రిల్ 29 ( మనం న్యూస్ )** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టం రైతులకీ చుట్టమని, పేదల పాలిట గొప్ప వరమని జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ధరణి వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటికీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఆర్ఓఆర్ 2025 చట్టం భూభారతితో సులభంగా పరిష్కారం అవుతుందన్నారు. ధరణి రిజిస్ట్రేషన్ లో పొరపాటు జరిగితే సరిదిద్దుకునే అవకాశం ఉండేది కాదని ఏదైనా అభ్యంతరాలు ఉంటే రైతులు సివిల్ కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టం మొత్తం పారదర్శకంగా ఉంటుందని గ్రామీణ ప్రాంతాల్లో సాదా బైనామతో కొనుగోలు చేసి పట్టా మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్న వారి భూముల సమస్యలు కూడా తీరనున్నాయన్నారు. భూ భారతి చట్టం రైతుల చుట్టమని, భూ వివాదల శాశ్వత పరిష్కారానికి తెచ్చిందే భూ భారతి చట్టమని ఆయన అన్నారు. ప్రతి వ్యక్తికి ఆధార్ లాగా ప్రతి భూమికి భూదార్ సంఖ్య కేటాయింపుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. ఏవైనా భూ సమస్యలు ఏర్పడితే కొత్త చట్టంలో అప్పీలు వ్యవస్థ ప్రవేశ పెట్టారని ఎమ్మార్వో,ఆర్డీవో,జేసీ,కలెక్టర్ కు అప్పీలు చేసుకొని సమస్య పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి గ్రామానికి గ్రామ పరిపాలన అధికారులను నియమించడంతో రైతులకు అన్ని సేవలు గ్రామంలోనే అందుతాయన్నారు. ఈ నూతన చట్టం పై రైతులకు, ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం ప్రజాపాలనకు నిదర్శనమన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు, ప్రజలకు అన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రివర్గానికి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ లకు జిల్లా రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

# వంటావార్పుతో పార్ట్ టైం లెక్చరర్ల నిరసన

**ఉద్యోగ భద్రత కల్పించాలి**

**మినిమం టైం స్కేల్ ఇవ్వాలి**



**కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 29 ( మనం న్యూస్ ) :** ఉద్యోగ భద్రత కోరుతూ తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణ పార్ట్ టైమ్ లెక్చరర్లు మంగళవారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. 9 వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా పార్ట్టైమ్ లెక్చరర్లు అందరూ కలిసి వంట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ., రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అలసత్వం వహించడం వల్లే తాము రోడ్డుపై వంట చేసుకొని తినే పరిస్థితికి కారణమైందని వారు ఆరోపించారు. ఇకనైనా తమ ఆకలి ఆర్తనాధాలను విని వెంటనే తమకు తగిన న్యాయం చేయాలని అన్నారు. జిఓ నెం.21ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. విశ్వవిద్యాలయాల్లో రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి జారీ చేసిన జీవో నెం. 21 లో తమకు వెయిటేజీ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. తక్కువ వేతనాలతో, ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా తాము గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇకనైనా తమ సర్వీసులను గుర్తించి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలిపిన విధంగా మినిమం టైం స్కేల్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం క్యాంపస్ లోని టీచింగ్, నాన్ టీచింగ్ వారు కలిసి భోజనాలు చేసి పార్ట్ టైం లెక్చరర్లకు సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

## జాతీయం- అంతర్జాతీయం

### కాంగ్రెస్, బీజేపీ మధ్య 'ఫొటో' వార్!




**ఢిల్లీ, ఏప్రిల్ 29:** పహల్గాం ఉగ్రదాడి ఘటనపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం నెలకొంది. ఈ క్రమంలో రెండు పార్టీల మధ్య ఫొటో వార్‌కు దిగాయి. కేంద్రంలో అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్ పార్టీ మధ్య మాటల యుద్ధం నెలకొంది. పహల్గాం ఉగ్రదాడి ఘటనపై నిర్వహించిన కీలక సమావేశానికి ప్రధాని మోడీ గైర్హాజరును తప్పుబడుతూ.. సామాజిక మాధ్యమాల్లో ఓ ఫొటోను ఉంచింది. దీన్ని ఖండించిన బీజేపీ.. కాంగ్రెస్ వ్యవహారశైలిని తూర్పారపట్టింది. రాహుల్ గాంధీ పోలికలతో కూడిన ఓ ఫొటోతో బదులిచ్చింది. అసలేం జరిగింది అంటే? పహల్గాం దాడి ఘటనపై తొలుత అత్యున్నత సమావేశం నిర్వహించిన కేంద్రం.. మరుసటి రోజు అఖిలపక్ష సమావేశం జరిపింది. ఈ సమావేశానికి ప్రధాని మోడీ దూరంగా ఉన్నారు. అదే రోజు బిహార్లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. దీన్ని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తప్పుబట్టారు. ఇదే అంశంపై సోమవారం ఆ పార్టీ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్లో ఓ ఫొటోను ఉంచింది. 'బాధ్యతగా వ్యవహరించాల్సిన సమయంలో గాయబ్' అనే క్యాప్షన్‌తో ఓ ఫొటోను ఉంచింది. నేరుగా ప్రధాని మోడీ పేరును గానీ, ఫొటోను గానీ ప్రస్తావించనప్పటికీ.. దుస్తులు, ఆహార్యం మోడీని పోలి ఉండడంతో బీజేపీ ప్రతి విమర్శలకు దిగింది. కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్‌తో చేతులు కలిపి ఆ భాష మాట్లాడుతోందని బీజేపీ ఐటీ సెల్ ఇన్చార్జి అమిత్ మాలవీయ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం ప్రధానిని ఆ పార్టీ లక్ష్యంగా చేసుకుందని విమర్శించారు. ఆ పార్టీ కూడా రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుంది. ఆ పార్టీ అధికార ప్రతినిధి ఆర్పీసింగ్.. 'పాకిస్థాన్ స్నేహితుడు' అనే ట్యాగ్‌లైన్‌తో ఓ ఫొటోను పోస్ట్ చేశారు. రాహుల్ గాంధీ పేరును ఎక్కడా ప్రస్తావించనప్పటికీ.. తెలుపు రంగు టీషర్ట్, క్యాప్ ధరించిన ఓ వ్యక్తి చేతిలో కత్తి పట్టుకున్న ఫొటోను తన ఎక్స్ ఖాతాలో ఉంచారు.

# కశ్మీర్లో మరిన్ని ఉగ్రదాడులకు అవకాశం.. 48 టూరిస్టు కేంద్రాల మూసివేత



**శ్రీనగర్,ఏప్రిల్ 29:** కశ్మీర్‌లో మరిన్ని ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత భారత భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ముష్కరులను పట్టుకునేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈక్రమంలో కశ్మీర్‌లో మరిన్ని ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. పహల్గాం దాడి అనంతరం కశ్మీరీ లోయలో స్లీపర్‌సెల్స్ యాక్టివేట్ అయినట్లు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్మూకశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాదుల ఇళ్లను సైన్యం పేల్చేస్తుండడంతో దానికి ప్రతీకారంగా వారు పెద్దఎత్తున దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని.. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే భద్రతా బలగాలకు సమాచారం ఇవ్వాలని సూచించాయి. దీంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కశ్మీర్ వ్యాప్తంగా ఉన్న మొత్తం 87 టూరిస్టు కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కశ్మీర్‌లోని ప్రధాన ప్రదేశాలు గుల్మార్గ్, సోనామార్గ్ దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన పర్యాటక ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించాయి. ప్రస్తుతం మళ్లీ పర్యాటకులు కశ్మీర్‌కు వస్తున్న నేపథ్యంలో నిఘా వర్గాలు తాజా హెచ్చరికలు చేశాయి. పహల్గాంలో ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పలు వీడియోలు, సమాచారం అందడంతో వాటి ఆధారంగా.. ఉగ్రవాదులను గుర్తించడానికి విచారణను వేగవంతం చేసింది. ఇందులోభాగంగా ఉగ్రదాడి ప్రదేశంలో సీన్ రీక్రియేట్ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో ఉన్న పర్యాటకులు, స్థానిక ప్రజలను ప్రశ్నిస్తున్నారు. అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు.

## డిస్కౌంట్లు అడగొద్దు బ్రదర్స్.. భారత్, పాక్ వాసులను ఉద్దేశిస్తూ బోర్డులు




**ఇస్తాంబుల్ ,ఏప్రిల్ 29:** డిస్కౌంట్లు అడగొద్దంటూ దక్షిణాసియా వాసులను ఉద్దేశిస్తూ ఇస్తాంబుల్లోని ఓ దుకాణంలో పెట్టిన బోర్డుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇస్తాంబుల్‌లోని ఓ దుకాణంలో పెట్టిన బోర్డు వివాదానికి దారితీసింది. దక్షిణాసియా ప్రజలను ఉద్దేశిస్తూ డిస్కౌంట్లు అడగొద్దంటూ పెట్టిన ఈ బోర్డు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో ఆ దుకాణంపై పలువురు యూజర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఒక దుకాణంలో తీసిన ఈ వీడియోలో 'భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ సోదరులారా.. దయచేసి డిస్కౌంట్లు అడగొద్దు' అని రాసి ఉన్న నోట్‌ను కౌంటర్ దగ్గర పెట్టారు. దీన్ని ఒకరు వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఇస్తాంబుల్లో దక్షిణాసియా ప్రజలకు ప్రత్యేకంగా ఎలాంటి తగ్గింపులు లేవని రాసి ఉన్న నోట్‌ను గుర్తించాను అని ఆ వ్యక్తి పేర్కొన్నారు. ఇది కాస్త వైరల్‌గా మరడంతో పలువురు నెటిజన్లు ఆ దుకాణంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ వీడియోకి 'సరిహద్దుల పరంగా విడిగా ఉంటాం. కానీ, ఇబ్బందులు ఏమైనా ఎదురైనప్పుడు కలిసిపోతాం' అని ఒక యూజర్ కామెంట్ చేయగా.. ఇది సరైన చర్య కాదని మరో యూజర్ రాసుకొచ్చారు. కాగా.. పలువురు యూజర్లు సైతం ఆ దుకాణంపై విమర్శలు చేస్తూ కామెంట్లు చేశారు.

## మనం ఐక్యంగా ఉండాలి.. ట్రంప్‌నకు అవకాశం ఇవ్వొద్దు: కెనడా ప్రధాని



**ఒట్టావా, ఏప్రిల్ 29:** ప్రజలను విడగొట్టి.. కెనడాను సొంతం చేసుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారని కెనడా ప్రధాని మార్క్ కార్నీ మండిపడ్డారు. కెనడాలో అధికార లిబరల్ పార్టీ మరోసారి అధికారం చేపట్టడం దాదాపు ఖాయమైంది. దీంతో విజయం దిశగా దూసుకెళ్తోంది. నూతన ప్రధానిగా మార్క్ కార్నీ మరోసారి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజల్లో విభేదాలు సృష్టించి, విచ్ఛిన్నం చేసి కెనడాను సొంతం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో అమెరికా సుంకాలు, విలీనానికి సంబంధించిన బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. కాబట్టి ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కెనడియన్లు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్యయుద్ధంలో అగ్రదేశంపై తాము గెలుస్తామని కార్నీ ప్రజలకు హామీ ఇచ్చారు. అమెరికా తమకు చేస్తున్న ద్రోహాన్ని ఎన్నటికీ మరిచిపోవ్దని.. దీని నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా కెనడా అనుసరిస్తున్న ఐక్యత, అభివృద్ధి, స్థితిస్థాపకత వంటి విలువలను తాను ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన మొదటి కొన్ని నెలలు సవాలుగా ఉండొచ్చని.. అయినప్పటికీ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కెనడా గతంలో కంటే బలంగా పుంజుకుంటుందని అన్నారు. ఎన్నికల్లో తమకు గట్టి పోటీ ఇచ్చినందుకు ప్రతిపక్ష నాయకుడు పోయిలీవ్రేను కార్నీ అభినందించారు. దేశ అభివృద్ధి విషయంలో తామందరం ఒకేలా ఆలోచిస్తామని తెలిపారు. కెనడా తమలో విలీనం కావాలని ఇప్పటికే పలుమార్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు పాల్పడిన విషయం తెలిసిందే. నేడు ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో ఆయన మరోసారి టారిఫ్ల ప్రస్తావన తీసుకువచ్చారు. కెనడా అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరితే.. ఇప్పటివరకు విధించిన సుంకాలను పూర్తిగా తొలగిస్తానన్నారు. యూఎస్‌తో ఎలాంటి సరిహద్దులు లేకుండా ప్రజలందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తామని.. వాణిజ్యం, వ్యాపారాల్లో ప్రతికూలతలు లేకుండా అన్నిరకాల సానుకూల చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తమ ప్రతిపాదనకు ఒప్పుకుంటే ఇలాంటి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని.. లేదంటే ప్రతియేటా ఆ దేశానికి ఇస్తున్న వందల బిలియన్ డాలర్ల సబ్సిడీని ఆపేస్తామని హెచ్చరించారు.

## మెహుల్ ఛోక్సీకి బెల్జియం కోర్టులో ఎదురుదెబ్బ



**బ్రుసెల్స్, ఏప్రిల్ 29:** పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసగించిన కేసులో ప్రధాన నిందితుడైన మెహుల్ ఛోక్సీకి బెల్జియం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కుట్ర, మోసం, అవినీతి అభియోగాలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీని బెల్జియం పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తన అరెస్టుని ఛోక్సీ బెల్జియం కోర్టులో సవాల్ చేశారు. అయితే, న్యాయస్థానంలో అతడికి ఎదురుదెబ్బ తగిలింది. ఛోక్సీ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరగ్గా.. కోర్టు కేసును వాయిదా వేసింది. తదుపరి విచారణ ఎప్పుడు ఉంటుంది అనేది తెలియరాలేదు. ఈ పిటిషన్‌లో అతడు బెల్జియం అధికారులపై పలు ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. తన అరెస్టుకు సంబంధించి అధికారులు సరైన చట్ట విధానాలను అనుసరించలేదని, తన ప్రాథమిక హక్కులకు సైతం భంగం కలిగించారని ఆరోపించాడని అధికారిక వర్గాలు తెలిపాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను దాదాపు రూ.13 వేల కోట్లకు పైగా మోసం చేశారని 2018లో ఆరోపణలు వెల్లువెత్తిన అనంతరం ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ (కేసులో మరో ప్రధాన నిందితుడు) దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ అంటిగ్వా-బార్బుడాకు వెళ్లగా.. నీరవ్‌మోడీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. ఛోక్సీ బెల్జియం పౌరసత్వం తీసుకున్నాడని గత నెల అక్కడి ప్రభుత్వం ధ్రువీకరించింది. ఆ దేశ జాతీయురాలైన తన సతీమణి ప్రీతి ఛోక్సీ సాయంతో 2023 నవంబరులో అతడు 'ఎఫ్ రెసిడెన్సీ కార్డ్' పొందాడు. అందుకు అతడు తప్పుడు పత్రాలు సమర్పించినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా.. అతడికి భారత్‌లో, అంటిగ్వాలో పౌరసత్వాలు ఉన్న విషయాన్ని దాచి పెట్టాడు. ఈ కారణాలతోనే అక్కడి అధికారులు ఛోక్సీని అరెస్టు చేశారు. మరోవైపు.. అతడిని భారత్‌కు రప్పించేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

## పహల్గాం దాడి.. మా ఉద్వేగాలతో ఆడుకోవద్దు: మృతుడి భార్య అభ్యర్థన



**పుణె, ఏప్రిల్ 29:** పహల్గాం ఉగ్రదాడి తో దేశం ఉలిక్కిపడింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన సంతోష్ జగ్‌దలే సతీమణి ప్రగతి జగ్‌దలే నేతలకు ఓ విజ్ఞప్తి చేశారు. ఈ దాడిని రాజకీయం చేయొద్దని, తమ ఉద్వేగాలతో ఆడుకోవద్దని కోరారు.మహారాష్ట్ర కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ స్పందన వచ్చింది. ఉగ్రవాదులకు కులం, మతం లేదని వాడెట్టివార్ అన్నారు. పర్యాటకులను కాల్చేముందు వారి మతం గురించి అడిగారంటున్న వాదనపైనా అనుమానం వ్యక్తంచేశారు. ఆ నేత వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. ఈ క్రమంలోనే ప్రగతి పుణెలో మీడియాతో మాట్లాడారు. ''ఇప్పటికీ ఆ ఉగ్రదాడి భయం మమ్మల్ని వీడలేదు. నేను కళ్లు మూసుకున్నప్పుల్లా.. రైఫిల్ పట్టుకున్న వ్యక్తి కనిపిస్తాడు. ఉగ్రవాదాన్ని దగ్గరి నుంచి చూశాం. విద్వేషపూరిత మాటలు విన్నాం. ఈ ఘటనను రాజకీయం చేయొద్దు. మా ఉద్వేగాలతో ఆడుకోవద్దని నేతలందరినీ కోరుతున్నా'' అని ఆమె అన్నారు.ఇదిలా ఉంటే.. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వెల్లడించారు. వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని క్యాబినెట్ సమావేశం అనంతరం వెల్లడించారు.

# ఉగ్రవాదం పై ఐక్యంగా ఉద్యమిద్దాం

- ఉగ్రవాదం రూపు మాపాలి
- మే 3 న ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞా కార్యక్రమం




**కర్నూలు, ఏప్రిల్ 29 (మనం న్యూస్):** ఉగ్రవాదం పై ఐక్యంగా ఉద్యమించాలని ఉగ్రవాదం రూపు మాపాలని మే 3 న ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞా కార్యక్రమం రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు పిలుపునిచ్చారు మంగళవారం నాడు స్థానిక సీఆర్ భవన్ నందు ఏఐవైఎఫ్ కర్నూల్ నగర ముఖ్య నాయకుల సమావేశం నగర అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ పహల్గాంలో ఉగ్రవాద పిరికిపంద చర్య అని భారత ప్రజాస్వామ్యం పైనే దాడిగా భావిస్తూ ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని. అఖిల భారత యువజన సమాఖ్య అఇగిఊ 66 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మే 3 న ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞా కార్యక్రమం నిర్వహించాలని ఆయన కోరారు జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదులు హిందువునే లక్ష్యంగా చేసుకొని అత్యదునిక ఆయుధాలతో వేటాడి వెంటాడి చంపడం చాలా దుర్మార్గమన్నారు.భార్య పిల్లల ముందే తమ కుటుంబీకులను చంపడంతో తీవ్ర భయంతో పరుగులు తీసిన వారిని చూస్తుంటే చాలా బాధేస్తుందన్నారు.గతంలో కూడా ఉగ్రవాద ముష్కరలు బహిరంగ ప్రదేశాల్లో బాంబులు పేల్చి అనేకమందిని పొట్టని పెట్టుకోవడం జరిగిందని ఈ ఉన్మాదుల ఆటలు కట్టించకపోతే మరిన్ని ప్రాణాలు గాల్లో కలిసి పోతాయన్నారు. మూడంచల భద్రత కలిగినటువంటి జమ్మూ కాశ్మీర్ లోకి ఉగ్రవాదులు ఎలా ప్రవేశించారు సమగ్రమైన విచారణ చేపట్టి సహకరించిన వారిని వదిలిపెట్టరాదన్నారు. పహల్గాం మృతుల్లో ఏపీకి చెందిన వారు ఉండడం మరింత బాధకరమన్నారు. పహల్గాం దాడిని దుర్మార్గపు చర్యగా భారత ప్రజలు భావిస్తుంటే ఏకంగా ఢిల్లీలోని పాకిస్తాన్ హై కమిషన్ కార్యాలయంలోకి కేక్ తీసుకు వెళుతుంటే భద్రతా సిబ్బంది ఏమి చేస్తోందని ప్రశ్నించారు. పర్యాటకుల మత విశ్వాసాలని ఉగ్రవాదులు తెలుసుకొని పాశవికంగా కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అఖిల భారత యువజన సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో ప్రతిజ్ఞా కార్యక్రమం నిర్వహించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న, నగర నాయకుడు అఖిల్ , కాశి, మునిస్వామి, కుమారు, శివ, పాల్గొన్నారు.

# మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం

**ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత**




**మహానంది, ఏప్రిల్ 29, (మనం న్యూస్):** బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతోగానో దోహద పడుతుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ కవిత అన్నారు. మంగళవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలోని వెలుగు కార్యాలయంలో కిశోరి వికాసం స్పెషల్ సమ్మర్ క్యాంపెయిన్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్య వివాహాల నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, విద్య, బాలల హక్కులు, బాలల అక్రమ రవాణా, పోషకాహారం పలు విషయాలపై అవగాహన కల్పించారు.ఏపీఎం తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ ఫైనాన్స్ మేనేజ్మెంట్, బ్యాంక్ అకౌంట్స్, సేవింగ్, కిశోరి బాలికలు ఏ విధంగా ఉపయోగించుకోవాలని వివరించారు. ఎంపీహెచ్ ఈవో హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ కిశోరి బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, న్యూట్రిషన్, ఆరోగ్యం గురించి పలు సూచనలు, సలహాలు చేశారు.ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు, హెల్త్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

# ఆర్డిటి సేవలు యధావిధిగా కొనసాగించాలి

- ఆర్డిటి ఎఫ్సీఆర్ఎ రెన్యూవల్ పునరుద్ధించేందుకు చర్యలు చేపట్టాలి
- కరువు పీడిత ప్రాంతాల్లో ఆర్డిటి కల్పతరువు
- దేవనకొండ లో ప్రజాసంఘాల నేతలు డిమాండ్



**దేవనకొండ, ఏప్రిల్ 29 (మనం న్యూస్):** ఆర్డిటి సేవలు యధావిధిగా కొనసాగించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి. వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం. నరసారావు లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. 1969లో విన్సెంట్ ఫెర్రర్,అన్నే ఫెర్రర్ దంపతులచే రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్(ఆర్డిటి) అనంతపురం జిల్లాలో స్థాపించబడిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదరికం,బాధలు, అన్యాయాలను నిర్మూలించడానికి సమాన అవకాశాలు,సంపదను అందరికి అందించడానికి సంస్థను ప్రారంభించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సంస్థను ఏర్పాటు చేసి కరువు పీడిత ప్రాంతాల్లో 'ఫుడ్-ఫర్-వర్క్ కార్యక్రమాన్నిప్రారంభించి తద్వారావేలాదిగా బావులు తవ్వటం,లక్షలాది గృహాల నిర్మాణం,కుష్టు వ్యాధి కేంద్రం స్థాపన వంటి పనులు చేపట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభించి కూలీలను రైతులుగా మార్చడంలో సహాయపడిందన్నారు. గ్రామీణ సమాజంలో పేదరికం,బాధలు,అన్యాయాలను తొలగించి స్థిరమైన అభివృద్ధి ద్వారా సమాజాన్ని సాధికారపరచడంమహిళలు,పిల్లలు,వైకల్యంఉన్నవ్యక్తులు,గిరిజన వర్గాల అభివృద్ధి కోసం ఆర్డిటి సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.విద్య, వైద్యం, గృహనిర్మాణం, స్థిరమైన జీవనోపాధి,సాంస్కృతిక క్రీడా కార్యక్రమాల ద్వారా పేదల అభ్యున్నతికి తీవ్రంగా కృషి చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలను మెరుగుపరచడానికి మొబైల్ లైబ్రరీలు ట్యూషన్ స్కూళ్లు ఏర్పాటు చేయడమే కాకుండా స్కాలర్ షిఫ్ అందిస్తోందన్నారు. బత్తలపల్లి, కల్యాణదుర్గం, కనేకల్లు లో రెండు సెకండరీ ఆసుపత్రులు, ఒక ప్రైమరీ హెల్త్కేర్ సెంటర్ స్థాపించిందని ఇక్కడ రోజువారీగా 3,000 మంది పేదవారు ఈ ఆసుపత్రుల సేవలను వినియోగించు కుంటున్నారన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఆదాయ ఉత్పత్తి కార్యక్రమాలు, వృత్తిశిక్షణలు,మహిళల భద్రత, సమానత్వం కోసం పలు కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. వైక్యల్యంతో బాధపడుతున్న వారి కోసం కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్ సెక్టర్ స్థాపించి కృత్రిమ అవయవాలు, పునరావాస కేంద్రాలు ఉపాధి అవకాశాలు అందిస్తోందన్నారు. వేలాది మంది రైతులకు మైక్రో ఇరిగేషన్ వ్యవస్థలు అందించి, నీటి ఆదా,ఉత్పత్తి పెంపు సాధించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణం,రోడ్లు,తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నదన్నారు. 2012లో ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ నుండి గృహ నిర్మాణంలో అత్యుత్తమ సేవలకు గుర్తింపు లభించిందన్నారు. ఫెర్రర్ మరణానంతరం ఆయన కుమారుడు మంచో ఫెర్రర్ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు. పేదల సంస్థగా పేరొందిన రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (అర్డిటి) నెత్తిన కేంద్ర ప్రభుత్వం బాంబు పేల్చిందన్నారు. ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫిసిఆర్ఎ) కింద వివిధ దేశాల నుంచి ఆర్టీటీకి అందుతున్న సహాయానికి సంబంధించి రెన్యూవల్ పునరుద్ధరణను నిలిపివేయడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులే కాకుండా నేరుగా విదేశాల నుంచి నిధులు తెచ్చి, అనంతపురం జిల్లాతో పాటు రాయులసీమలోని అన్ని ప్రాంతాల్లో వెనకబడిన వర్గాల అభివృద్ధి కోసం మంచో ఫెర్రర్ కృషి చేస్తున్నారన్నారని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సంస్థ చేపట్టిన సేవలు ప్రస్తుతం ఏపీతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు విస్తరించాయన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో రాయలసీమ ప్రాంతంలో ₹రాజకీయాల కతీతంగా పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు సమాయత్త మవుతున్నారని తెలిపారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి,ఆర్డిటి సంస్థకు వివిధ దేశాల నుండి అందే ఆర్థిక సహాయానికి సంబంధించిన ఎఫ్సీఆర్ఎ రెన్యూవల్ పునరుద్ధరించే విధంగా తగు చర్యలు చేపట్టాలని వారు కోరారు ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం మండల సీనియర్ నాయకులు తిమ్మప్ప సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ భాష, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ సి ఆర్ ఏ రిజిస్ట్రేషన్ ను రెన్యువల్ చేయాలి

- సిపిఎం మండల అధ్యక్షులు శ్రీరాములు

**తుగ్గలి, ఏప్రిల్ 29( మనం న్యూస్ ):** రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి) అనేది దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని విన్సెంట్ ఫెర్రర్ 1969 సంవత్సరంలో రూలర్ డెవలప్మెంట్ ట్రస్ట్ స్థాపించి పేద,వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుబడి సేవలు అందిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయకపోవడం బాధాకరమని సిపిఎం మండల అధ్యక్షులు శ్రీరాములు పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీరాములు లేఖరులతో మాట్లాడుతూ దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఆర్డిటి నేడు ప్రమాదంలో పడిందన్నారు. (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్) రిజిస్ట్రేషన్ ను పునరుద్ధించుకో పోవడంతో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ పై ఆధారపడిన ఎంతోమంది జీవితాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆర్డిటి సేవలు పునరుద్దించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.



# లక్ష్మీతాండాలో ఘనంగా శ్రీశ్రీశ్రీ మారెమ్మ అవ్వ దేవర ఉత్సవాలు



- భక్తిశ్రద్ధలతో మారెమ్మ దేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే శ్రీ దేవమ్మ

**తుగ్గలి, ఏప్రిల్ 29( మనం న్యూస్ ):** తుగ్గలి మండల పరిధిలోని లక్ష్మీ తాండా గ్రామంలో శ్రీశ్రీశ్రీ మారెమ్మ అవ్వ దేవర మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. మారెమ్మ అవ్వ దేవత దేవర ఉత్సవానికి ముఖ్యఅతిథిగా వైఎస్ఆర్సిపి పత్తికొండ మాజీ శాసనసభ్యురాలు కంగాటి శ్రీదేవమ్మా హాజరై భక్తిశ్రద్ధలతో మారెమ్మ అవ్వ దేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమానికి వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి, వైసిపి గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్ర రెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్ యాదవ్,మాజీ జెడ్పిటిసి, నారాయణ నాయక్,జెడ్పిటిసి పులికొండ నాయక్,మాజీ ఎంపీపీ ఎర్ర నాగప్ప,వైసీపీ మండల అధ్యక్షులు అట్లా గోపాల్ రెడ్డి, ఐటీ వింగ్ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, చాంద్ భాషా,వెంకటేష్ నాయక్,రాజు నాయక్, హనుమంతు నాయక్, విష్ణువర్ధన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సుంకలాపరమేశ్వరి దేవి దేవరకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

**తుగ్గలి, ఏప్రిల్ 29( మనం న్యూస్ ):** మండల కేంద్రమైన తుగ్గలి ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సుంకలాపరమేశ్వరి దేవి దేవాలయంలో సుంకలాపరమేశ్వరి దేవి విగ్రహాన్ని ప్రతిష్టించిన తర్వాత మంగళవారం జరిగిన దేవర ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పాల్గొని శ్రీ సుంకలాపరమేశ్వరి దేవి ని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- పోలీస్ కమిషనర్ గౌస్ఆలం




**కరీంనగర్ క్రైం,ఏప్రిల్29( మనంన్యూస్)** పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ కమీషనర్ గౌస్ఆలం అన్నారు.కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కరీంనగర్ పోలీసు

కమీషనర్ గౌస్ ఆలం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్, పోలీసు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ ను సరైన పద్ధతిలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్లు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లను తరచూ సందర్శిస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. డివిజన్ల వారీగా ఏసీపీ అధికారులు ప్రతి నెలా నేర సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. సీసీసీ ద్వారా వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. ఆకస్మికంగా తలెత్తే శాంతి భద్రతల సమస్యలను ఎదుర్కొనేందుకు సిబ్బంది లాఠీలు, హెల్మెట్లు వంటివి సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు.

ఎస్ హెచ్ ఓలుగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ, ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు పోలీస్ స్టేషన్ మేనేజ్మెంట్‌ను సక్రమంగా నిర్వహించాలని, పోలీస్ స్టేషన్ , పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణ సరైన పద్ధతిలో ఉండాలని, నమోదైన కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్లో నమోదు చేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, పాయింట్ బుక్ల ఏర్పాటు, సమన్ల జారీ వంటి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.డివిజన్ ను సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు ఏఎస్ఐ లేదా హెడ్ కానిస్టేబుల్‌ను ఇంచార్జ్‌గా నియమించాలని, తిరిగి సెక్టార్లను రెండు మూడు గ్రామాలతో కలిపి సబ్-సెక్టార్లుగా విభజించి వాటికి పోలీస్ కానిస్టేబుళ్లను కేటాయించాలని ఆదేశించారు. దీని ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు.రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెలా వారికి సంబంధించిన కొత్త సమాచారం సేకరించి నమోదు చేసుకోవాలని అన్నారు.గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా, పి.డి.ఎస్. బియ్యం అక్రమ రవాణా, పేకాట స్థావరాలను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనలో భాగంగా స్థానిక పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కమిషనరేట్ వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లకు, అధికారులకు కేటాయించిన వాహనాలను తనిఖీ చేసి వాటిని సక్రమంగా వినియోగించాలని, డ్రైవర్లకు ఎప్పటికప్పుడు సరైన శిక్షణ ఇవ్వాలని తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ ఐపీఎస్, ప్రొబేషనరీ ఐపీఎస్ వసుంధర, అడిషనల్ ఎస్పీ నరేందర్, ఏసీపీలు వెంకటస్వామి (టౌన్), హుజురాబాద్ ఏసీపీ సిహెచ్ శ్రీనివాస్, యాదగిరి స్వామి (ట్రాఫిక్), శ్రీనివాస్ (ఎస్బి), మాధవి (ఫంక్షనల్ వర్టికల్స్), వేణుగోపాల్ (సీటీసీ), కాశయ్య (సీసీఎస్) లతో పాటు కమిషనరేట్లోని అన్ని విభాగాల, పోలీస్ స్టేషన్ల, సర్కిల్లకు చెందిన ఇన్స్పెక్టర్లు, హెడ్ క్వార్టర్స్ లోని అన్ని విభాగాల రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఎస్ హెచ్ ఓలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌సిసి కల్నల్ అధికారిని సన్మానించిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

**కరీంనగర్ టౌన్,ఏప్రిల్29 (మనం న్యూస్):** నూతన యన్.సి.సి. కల్నల్ అధికారి జయంత ను మంగళవానం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ హై స్కూల్ లో అల్ఫోర్స్ విధ్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.అనంతరం ఆయన మాటాడుతూ నేటి సమాజంలో విద్యార్థుల్లో దేశభక్తిని రెట్టింపు ఉత్సాహంతో పెంపొందించాలని , దేశాన్ని రక్షించడానికై అన్ని వేళలల్లో అందుబాటులో ఉండాలని తద్వారా సమా జంలో అభివృద్ధి శరవేగంగా జరుగు తుందని అన్నారు.యన్.సి.సి విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నదని తెలుపుతూ యన్.సి.సి వారి విధివిధానాలు చాలా ప్రశంసనీయమైనవని, పౌరులకు రక్షణ కవచంలాంటివని వారు అభివర్ణించారు. అనంతరం జయంత మాట్లా డుతూ అల్ఫోర్స్ పాఠశాలలో యన్.సి.సికి సం బంధించిన ప్రణాళికలను చాలా చక్కగా రూ పొందించడమే కాకుండా వాటిని సకా లం లో అమలుపరుస్తున్నారని ప్రశంసిస్తు పాఠ శాల పాఠ్యాంశ ప్రణాళికల్లో భాగంగా విద్యా ర్థులకు పలు నైతిక విలువలతో పాటు దేశ రక్షణకు సంబందించిన విషయాలు భోదిం చడం చాలా గర్వించదగ్గ విషయమని చెప్పారు.

# సేవా విలువలకు నిజమైన ప్రతిబింబం ‘ పద్మభూషణ్ పురస్కారం’

**తుగ్గలి, ఏప్రిల్ 29( మనం న్యూస్ ):** భారతదేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మ భూషణ్ పురస్కారాన్ని హిందూపురం ఎమ్మెల్యే నటసింహం నందమూరి బాలకృష్ణ కు సోమవారం ఢిల్లీలోనే రాష్ట్రపతి భవన్ లో దేశ ప్రథమ పౌరరాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉందని టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, టీడీపీ మండల ఉపాధ్యక్షులు వెంకటరాముడు చౌదరి పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా తెలుగు సినిమా ఇండస్ట్రీకి అందిస్తున్న బాలయ్య.. సినీ రంగంతో పాటు రాజకీయ రంగం,సామాజిక సేవలో బాలయ్య చేసిన విశిష్ట సేవలకు గుర్తుగా పద్మభూషణ్ పురస్కార గౌరవం లభించడంఆనందంగా ఉందన్నారు.ఇలానే మరెన్నో విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని భగవంతున్ని కోరుకుంటున్నామన్నారు.



# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో




**తుగ్గలి,ఏప్రిల్ 29( మనం న్యూస్):** తుగ్గలి మండల పరిధిలోని ఎద్దులదొడ్డి గ్రామంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి విశ్వమోహన్ పరిశీలించారు. ఉపాధి కూలీలతో పనులపై పలు విషయాలు మాట్లాడి,మాస్టర్లు పరిశీలించి,హాజరు తీసుకున్నారు. వేసవి ఎండలు తీవ్రత పెరుగుతున్నందున పని ప్రదేశాల్లో కూలీలకు త్రాగునీరు,నీడ,ఓఆర్ఎస్ ప్యాకెట్లు,ఇతర సౌకర్యాలను కల్పించాలని ఉపాధి సిబ్బందికి ఆదేశించారు,ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పని వివరాలను పక్కాగా రికార్డ్లో నమోదు చేయాలన్నారు.ఈ పరిశీలనలో ఎంపీడీవో వెంట ఫీల్ అసిస్టెంట్ ఉన్నాడు.

# మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం‘రుతు ప్రేమ‘



**కోహెడ,ఏప్రిల్ 29,(మనం న్యూస్):** మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం రుతు ప్రేమ కార్యక్రమాన్ని చేపట్టినట్లు డిపిఓ దేవకీ దేవి తెలిపారు. కోహెడ మండలం సముద్రాల గ్రామంలో ఋతుప్రేమ కార్యక్రమంలో భాగంగా మెన్ స్ట్రువల్ కప్, క్లాత్ ప్యాడ్ ల వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపిఓ దేవకీదేవి మాట్లాడుతూ... మానవ మనుగడను శాసించేది రుతుచక్రం అని, రుతు చక్రం లేకపోతే.. జీవనమే లేదని పేర్కొన్నారు. మీ ఆరోగ్యం కాపాడాలని, మీ డబ్బు ఆదా చేయాలనే ఉద్దేశంతో, మీకు ఆరోగ్య వంతమైన, సౌకర్యవంతమైన, శాస్త్రీయమైన రుతుచక్రం పై మీకు అవగాహన కల్పించేందుకు ఈ రుతుప్రేమ కార్యక్రమం చేపట్టాము అని తెలిపారు. ప్లాస్టిక్ కెమికల్స్ కలిగిన ప్యాడ్ వల్ల మహిళల ఆరోగ్యానికే కాదు, పర్యావరణానికి కూడా ప్రమాదమేనని చెప్పారు. క్లాత్ ప్యాడ్స్, మెన్ స్ట్రువల్ కప్ ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు.మెన్ స్ట్రువల్ కప్ 8 నుంచి 10 ఏండ్ల వరకూ వాడొచ్చు అని, ఇవి సురక్షితమని, ఆరోగ్యకరమన్నారు. నెలనెలా ప్యాడ్స్ కొనాల్సిన అవసరము లేదని, అలా ప్రతి మహిళకూ ఏటా రూ.1200 వరకు ఆదా అవుతుందన్నారు. అనంతరం మహిళలకు, యువతులకు ఉచితంగా మెన్ స్ట్రువల్ కప్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సెట్విన్ కోఆర్డినేటర్ అమీనా, ఇంచార్జి ఎంపిఓ శోభ, మహిళ పంచాయతి కార్యదర్శులు నిహారిక, నజియా, వివోఏలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




## కొడుకు క్రికెట్ కల కోసం పొలం అమ్మేసిన తండ్రి!
# ఐపీఎల్‌లో వైభవ్ రికార్డు





14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించాడు. అత్యంత పిన్నవయసులో శతకం బాదిన క్రికెటర్‌గా అవతరించాడు. కేవలం మూడో ఇన్నింగ్స్‌లోనే ఈ ఘనత సాధించడం విశేషం. నెట్స్‌లో ఒక రోజుకు 600 బంతులను ప్రాక్టీస్ చేసేవాడు.

అయితే, అతడి క్రికెట్ కెరీర్ వెనక వైభవ్ తండ్రి శ్రమ ఉందనేది కాదనలేని సత్యం. వైభవ్ క్రికెట్ కలను నెరవేర్చేందుకు తనకున్న పొలాన్ని కూడా అమ్మేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ప్రపంచ రికార్డు సృష్టించడంతో వైభవ్ తల్లిదండ్రులకు ఇంతకుమించిన ఆనందం మరేదీ ఉండదు. బిహార్‌కు చెందిన సంజీవ్ సూర్యవంశీ క్రికెటర్ కావాలని అనుకొనేవాడు. అయితే, కుటుంబ బాధ్యతల కోసం ఆటకు దూరం కావాల్సి వచ్చింది. అందుకే తన కొడుకు వైభవ్‌ను ప్రోత్సహించాడు. 2011లో జన్మించిన వైభవ్ 12 ఏళ్లకే అండర్-19 యూత్ టెస్టుమ్యాచులో సెంచరీ సాధించాడు. దీంతో రాహుల్ ద్రవిడ్ దృష్టిలో పడటంతో ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ.1.1 కోట్లకు దక్కించుకున్నారు. ఆడిన తొలి మ్యాచ్‌లో మొదటి బంతినే సిక్స్‌గా మలిచిన అతడు తన ఉద్దేశం ఏంటో బలంగా చాటిచెప్పాడు. ఇప్పుడు సెంచరీ సాధించిన వైభవ్ క్రికెట్ జర్నీ గురించి కోచ్ మనీశ్ ఓజా ఆసక్తికర విశేషాలను వెల్లడించారు.

### తొమ్మిదేళ్ల వయసు నుంచి..

బిహార్‌లోని సమస్తిపూర్ నుంచి పట్నా వరకు దాదాపు 100 కి.మీ. ప్రయాణించి మరీ ప్రాక్టీస్‌కు వచ్చేవాడు. అప్పుడు అతడి వయసు తొమ్మిదేళ్లు మాత్రమే. ''నా దగ్గరకు వచ్చేటప్పటికి వైభవ్ వయసు తొమ్మిదేళ్లు. రోజు మార్చి రోజు వంద కి.మీ.లు ప్రయాణించి మరీ వచ్చేవాడు. ఉదయం 7.30 గంటలకు మొదలుపెట్టి సాయంత్రం వరకు ప్రాక్టీస్ చేసేవాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్లేవాడు. ఇదే షెడ్యూల్‌ను దాదాపు నాలుగేళ్లపాటు పాటించేవాడు. బిహార్‌లో అతడికి మంచి పేరు వచ్చింది. దీని వెనక వైభవ్ తల్లిదండ్రులదే కీలక పాత్ర. అతడి తల్లి వేకువజామున 4 గంటలకు లేచి ఆహారం సిద్ధం చేసేవారు. వైభవ్‌ను తండ్రి సంజీవ్ ట్రైనింగ్‌లు, మ్యాచుల కోసం తీసుకొచ్చేవారు. మేం కేవలం కోచ్‌లుగా ఉన్నామంతే. ప్రతి విషయంలోనూ తల్లిదండ్రుల ప్రోత్సాహం అతడిని ముందుండి నడిపించింది. అండర్-19 మ్యాచుల్లో ఓసారి రనౌట్ అయిన తర్వాత ఏడుస్తూ ఉన్న వైభవ్‌ను వీవీఎస్ లక్ష్మణ్ ఓదార్చాడు. పరుగులు ఎక్కువ చేయనందుకు బాధపడక్కర్లేదని.. తాము నైపుణ్యాలను మాత్రమే చూస్తామని భరోసా ఇచ్చాడు. ఆ తర్వాత ద్రవిడ్‌కు వైభవ్ గురించి వీవీఎస్ చెప్పడంతో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇవ్వగలిగాడు'' అని తెలిపారు.

### చాలా సంతోషంగా ఉంది: వైభవ్ అంకుల్ రాజీవ్ కుమార్

''మా గ్రామ స్థలంతా చాలా సంతోషంగా ఉన్నారు. ఇది మా జిల్లా, మా రాష్ట్రంతోపాటు దేశమంతా గర్వపడుతోంది. వైభవ్ తండ్రి కూడా క్రికెట్ ప్లేయర్. కాబట్టి, అతడి కుమారుడిని కూడా మైదానంలో చూడాలనేదే కోరిక. అందుకోసం చాలా కష్టపడ్డాడు'' అని సంజీవ్ సోదరుడు రాజీవ్ వెల్లడించారు. 'నేను ఇప్పటికే వైభవ్‌తో మాట్లాడా. కంగ్రాట్స్ చెప్పా. అతడికి మూడేళ్లు ఉన్నప్పటినుంచే ఆటపై ఆసక్తి ఉండేది. అతడు మరిన్ని విజయాలు సాధించాలని దేవుడిని ప్రార్థిస్తున్నా'' అని వైభవ్ బామ్మ ఉషా సింగ్ తెలిపారు.



## ఆర్సీబీ గెలిచినా కోహ్లీపై
# తప్పని ట్రోల్స్

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన సండే ఫైట్‌లో 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది ఆర్సీబీ. దీంతో 14 పాయింట్లతో పాయింట్స్ టేబుల్‌లో ఫస్ట్ ప్లేస్‌కు ఎగబాకింది. ప్లేఆఫ్స్‌కు అడుగు దూరంలో నిలిచిన చూసిన ఆర్సీబీని చూసి అంతా వణుకుతున్నారు. ముఖ్యంగా ఆరెంజ్ క్యాప్ విజేత, బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని చూసి మిగిలిన జట్లు భయపడుతున్నాయి. ఇప్పటికే 443 పరుగులు కొట్టిన కింగ్.. ఇతర మ్యాచుల్లో తమను చావబాదడం ఖాయమని ప్రత్యర్థి టీమ్స్ షేక్ అవుతున్నాయి. అయితే బ్యాట్‌తో పాటు స్టన్నింగ్ ఫీల్డింగ్, అలాగే కెప్టెన్ రజత్ పాటిదార్‌కు అండగా ఉంటూ ఆర్సీబీని అంతా తానై నడిపిస్తున్న కోహ్లీ మీద విమర్శలు మాత్రం తగ్గడం లేదు. దీనికి కారణం ఏంటనేది ఇప్పుడు చూద్దాం..

### టార్గెట్ చేసి..

ఐపీఎల్-2025లో కోహ్లీ రెచ్చిపోయి బ్యాటింగ్ చేస్తున్నాడు. అతడు 25 ప్లస్ పరుగులు చేసిన ప్రతిసారి ఆర్సీబీ నెగ్గుతూ వస్తోంది. దీన్ని బట్టే కింగ్ రాణించడం ఆ టీమ్‌కు ఎంత ముఖ్యమో అర్థం చేసుకోవాలి. నిన్న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లోనూ హాఫ్ సెంచరీ చేసి ఇన్నింగ్స్‌ను లీడ్ చేశాడు. అయితే ఇంత చేసినా అతడి స్ట్రైక్ రేట్‌పై విమర్శలు వస్తున్నాయి. డీసీతో మ్యాచ్‌లో 47 బంతుల్లో 51 పరుగులు చేశాడు విరాట్. ఇందులో 4 బౌండరీలు ఉన్నాయి. దీన్నే టార్గెట్ చేస్తున్నారు కొందరు నెటిజన్స్. కోహ్లీ భారీ షాట్లు ఆడటం లేదని, అతడి స్ట్రైక్ రేట్ 108గా ఉందని.. అసలు ఇలాగేనా టీ20ల్లో ఆడేదంటూ ట్రోల్ చేస్తున్నారు.

# ఎన్టీఆర్-నీల్ కాంబినేషన్
## 2026 జూన్ రిలీజ్ అంటూ ప్రకటన

ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ ఈ కాంబినేషన్లో సినిమా అనగానే అంచనాలు ఆకాశాన్నంటాయి. కెజియఫ్, సలార్ సినిమాల తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తున్న సినిమా కావడం ఒకటైతే ఇది ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ అవడం టైగర్ ఫ్యాన్స్ ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాలు టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తో పాటు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కన్నడ భామ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుండగా రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.కాగా ఈ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని పూజా కార్యక్రమాలు నిర్వహించిన రోజు ప్రకటించారు మేకర్స్. కానీ అనుకోని కారణాల కారణంగా షూటింగ్ వాయిదా పడుతూ వస్తుండడం, మధ్యలో వార్ 2కు ఆగస్టులో ప్రమోషన్స్ కోసం డేట్స్ ఇవ్వాల్సి ఉండడం వంటి కారణంగా ఈ సినిమా సంక్రాంతికి రాదు అనే వాదనలు వినిపించాయి. ఆ వాదనలకు తెరదించుతూ న్యూ రిలీజ్ డేట్ ను ప్రకటించారు మేకర్స్. 2026 జూన్ 25న ఎన్టీఆర్ నీల్ సినిమాను రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేసారు. అలాగే యంగ్ టైగర్ పుట్టిన రోజు కానుకగా మే 20న న ఎన్టీఆర్, నీల్ సినిమా గ్లిమ్స్ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్.



# హిట్-3తో వస్తున్న నాని

హ్యాట్రిక్ హిట్స్‌తో మంచి జోష్ మీదున్నాడు నాని. దసరా, సరిపోదా శనివారంతో హండ్రెడ్ క్రోర్ హీరోగా ఛేంజయిన న్యాచురల్ స్టార్ నుండి వస్తోన్న చిత్రం హిట్ 3. ఇప్పటి వరకు నాని కెరీర్‌లోనే మోస్ట్ వయెలెంట్ పిక్చర్‌గా రాబోతుంది. మే 1న థియేటర్లలోకి వచ్చేస్తున్నాడు అర్జున్ సర్కార్. ఇప్పటి వరకు ఈ సిరీస్ నుండి వచ్చిన టూఫిల్మ్స్ మంచి హిట్ కొట్టడంతో పాటు నాని హీరో కావడంతో హిట్ 3పై భారీ అంచనాలున్నాయి. అయితే హిట్ 3కి టఫ్ కాంపిటీషన్ ఇచ్చేందుకు హాలీవుడ్ తో పాటు కోలీవుడ్ చిత్రాలు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి సీజన్ తర్వాత ఇప్పటి వరకు డ్రై సీజన్ నడిచింది. కొన్ని అడపా దడపా చిత్రాలు కొన్ని డబ్బింగ్ మూవీస్ సందడి చేశాయి. ఏప్రిల్ మొత్తం బాక్సాఫీస్ డల్ అయ్యింది. ఇప్పుడు మేలో వచ్చే సినిమాలపైనే హోప్స్. మేడేన వచ్చేస్తున్నాడు నాని. ఇదే సినిమాను పాన్ ఇండియా భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. అయితే సౌత్, నార్త్ బెల్టులో హిట్ 3తో కొన్ని సినిమాలు పోటీపడుతున్నాయి. ముందుగా సూర్య.. హిట్ 3కి పోటీగా రెట్రోను మల్టీ లాంగ్వేజ్‌లో సినిమాను దింపుతున్నాడు. అలాగే టూరిస్ట్ ఫ్యామిలీ తమిళనాడులో రెట్రోతో పాటు హిట్ 3కి పోటీగా రాబోతుంది. హిందీ బెల్ట్‌లో చూస్తే సీనియర్లు అజయ్ దేవగన్ 2018లో వచ్చిన సక్సెస్ ఫుల్ మూవీ రైడ్‌కు సీక్వెల్‌గా రైడ్ 2 మే 1న రిలీజ్ చేస్తున్నాడు.



# అభిమానికి క్షమాపణలు చెప్పిన ప్రీతి జింటా



బాలీవుడ్ నటి ప్రీతి జింటా ఓ అభిమానికి క్షమాపణలు చెప్పారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ప్రీతి ఎక్స్‌లో అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ క్రమంలోనే ఓ అభిమాని 'మీరు భాజపాలో చేరుతున్నారా?' అని అడగ్గా.. దానికి ప్రీతి కాస్త కఠినంగా సమాధానమిచ్చారు. దీంతో నెట్టింట ఆమె తీరుపై విమర్శలు ప్రారంభమయ్యాయి. తాజాగా ఆ ప్రశ్న అడిగిన అభిమానికి ప్రీతి క్షమాపణలు చెప్పారు.'కొన్నిరోజుల క్రితం మీరు చేసిన పోస్ట్ చూస్తుంటే భవిష్యత్తులో భాజపాలో చేరతారేమో అనిపిస్తుంది. రాజకీయాల్లోకి వస్తారా?' అని అడగ్గా.. దానికి ప్రీతి సమాధానమిస్తూ.. ''సోషల్ మీడియాతో వచ్చే ఇబ్బంది ఇదే. ప్రతిఒక్కరూ మనల్ని జడ్జ్ చేస్తారు. నేను గతంలో చెప్పినట్లు దేవాలయాలకు, కుంభమేళాలకు వెళ్తే దాని అర్థం భాజపాలో చేరతానని కాదు. విదేశాల్లో ఉన్నసమయంలో దేశం విలువ నాకు తెలిసింది. అందరి కంటే నేను ఇప్పుడు భారత్‌ను, భారతీయ సంస్కృతిని ఎక్కువగా గౌరవిస్తున్నాను'' అని అన్నారు. ఈ చిన్నప్రశ్నకు ఇంత కఠినంగా జవాబివ్వాలా అని కొందరు విమర్శించారు. దీంతో తాజాగా ఆమె క్షమాపణలు చెప్పారు. ''నా సమాధానం మీకు కఠినంగా అనిపిస్తే నన్నుక్షమించండి. మీ ప్రశ్నచూసి అసహనానికి గురయ్యాను. నేను విదేశాల్లో ఉంటున్నందుకు నా పిల్లలు భారతీయతను మర్చిపోకూడదు కదా..! అందుకే వారికి దేశ గొప్పతనం తెలియాలని దేవాలయాలకు తీసుకెళ్తాను. దురదష్టవశాత్తూ నేను ఈ విషయంలో ప్రతిసారీ విమర్శలు ఎదుర్కొంటున్నాను. దీన్నిరాజకీయం చేస్తున్నారు. అందుకే అలా మాట్లాడాను. మీరంటే నాకు ఎప్పుడూ గౌరవమే'' అని ఆ అభిమానికి వివరణ ఇచ్చారు. గతంలోనూ ప్రీతి జింటా తన రాజకీయ రంగ ప్రవేశం గురించి ప్రస్తావించిన విషయం తెలిసిందే. తనకు అలాంటి ఉద్దేశం లేదన్నారు. గతంలో తనకు కొన్నిరాజకీయ పార్టీలు టికెట్, రాజ్యసభ సీటు ఆఫర్ చేశాయని తెలిపారు. తాను మర్యాదపూర్వకంగా వాటిని తిరస్కరించినట్లు చెప్పారు. ఆ రంగంపై తనకు అసలు ఆసక్తి లేదన్నారు.

## వరుణ్ తేజ్.. మేర్లపాక కాంబోలో
# మూవీ



బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్స్ తో డౌన్ ఫాల్ లో ఉన్నాడు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్. ఎన్నో ఆశలు పెట్టుకున్న మట్కా మొదటి ఆటకే మకాం సర్దేసింది. దీంతో కాస్త గ్యాప్ తీసుకుని కథలపై దృష్టి పెట్టిన ఈ మెగా హీరో యంగ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్ లో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు కొరియన్ కనకరాజ్ అనే క్రేజీ టైటిల్ ఫిక్స్ చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లోని ఆచార్య సెట్ లో జరుగుతుంది. సినిమాలో వచ్చే ఐటమ్ సాంగ్ కోసం అక్కడ నిర్మించిన ప్రత్యేక సెట్స్ లో సాంగ్ షూట్ చేస్తున్నారు. ఈ కోసం హాట్ బ్యూటీని రంగంలోకి దింపుతున్నారు. హుషారు, బంగార్రాజు వంటి సినిమాలలో మెప్పించిన దక్షా నాగర్కర్ కొరియన్ కనకరాజ్ లో వరుణ్ తేజ్ తో కలిసి ఆడిపాడనుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.